# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం








సంపుటి: 01 | సంచిక: 332 | హైదరాబాద్ | మంగళవారం | 20-05-2025 | పేజీలు: 08


## మంత్రి పదవి కోసం కొత్త ఎత్తులు..

సీనియర్లతోనూ సత్సంబంధాలు

మారిన వైఖరిపై కాంగ్రెస్‌లో చర్చ



2

## కాళేశ్వరం కమిషన్ గడువు మరోసారి పొడిగింపు



కాళేశ్వరం కమిషన్ గడువు మరో రెండు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు

మే 31తో ముగియనున్న కమిషన్ పదవీ కాలం

బహిరంగ విచారణను ముగించినట్లు ప్రకటించిన కమిషన్ వర్గాలు

గడువును జూలై 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ



2

## అందాల పోటీలకైతే 300 కోట్లు.. పుష్కరాలకు రూ.35 కోట్లేనా?

12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే పుష్కారాలు

పుష్కర స్నానం చేయడం చాలా సంతోషంగా ఉంది

ప్రభుత్వం పెద్ద పుష్కర పండగకు రూ.35 కోట్లిచ్చింది

అందాల పోటీలకు మాత్రం రూ. 300 కోట్లు విడుదల చేశారు

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు



2

## జ్యోతి మల్హోత్రా తండ్రి ఏమన్నారంటే?

హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా అరెస్టు

పాక్ తరపున గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలు

జ్యోతి మల్హోత్రా గురించి సంచలన విషయాలు బయటపెట్టిన తండ్రి..

వెలుగులోకి అనేక దిగ్భ్రాంతికరమైన విషయాలు





2

# వరి వేస్తే ఉరి కాదు.. వరి వేస్తే సిరి!

రాష్ట్రంలోని ఆ ఐదారుగురు సన్నాసుల గురించి పట్టించుకోను..

ఇందిరా గాంధీ లాంటి పౌరుషం ఉన్న ప్రధాని దేశానికి కావాలి

50 ఏండ్ల తర్వాత కూడా ప్రతి ఒక్కరి గుండెల్లో ఇందిరమ్మ ఉంది

పెహల్గాం దాడి తర్వాత.. ఇందిరమ్మ లాంటి ప్రధాని కావాలని కోరుతున్నారు

'ఇందిర సౌర గిరి జల వికాసం' ప్రారంభ సభలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు





**హైదరాబాద్ మే 19(ప్రజాక్షేత్రం):**

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులకు జరిగిన అన్యాయాన్ని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో పర్యటించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, సీతక్క, జూపల్లి కృష్ణారావుతో కలిసి "ఇందిర సౌర గిరి జల వికాసం" పథకాన్ని ప్రారంభించారు. రూ.12,600 కోట్లతో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఒక్కో యూనిట్‌కు రూ.6 లక్షల చొప్పున వంద శాతం సబ్సిడీతో లబ్ధిదారులకు లాభం చేకూరనుంది. ముందుగా సీతారామాంజనేయ ఆలయాన్ని

...మిగతా 2లో



## గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదం వెనుక అక్రమ కరెంట్ కనెక్షన్..!

హైటెన్షన్ వైర్ నుంచి కొక్కేల ద్వారా కరెంట్ తీసుకున్న స్థానికులు

ఈ అక్రమ కరెంట్‌తో బాధిత కుటుంబం కరెంట్ మీటర్‌పై లోడ్

ఆ కరెంట్ లోడ్‌తో బాధిత కుటుంబం మీటర్‌బాక్స్‌లో మంటలు

**హైదరాబాద్ మే 19(ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్ పాతబస్తీలోని గుల్జార్‌హౌస్ ప్రాంతంలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదం మృత్యుపాశాన్ని మోసుకొచ్చింది. ఈ ఘటనపై పోలీసులు, ఫైర్ సిబ్బంది ప్రాథమికంగా చేసిన దర్యాప్తులో ఓ కీలక విషయాన్ని బయటపెట్టింది. ఆ విషాదానికి మూలంగా అక్రమ కరెంట్ కనెక్షన్ ఉన్న ఉన్నట్టు అధికారులు అనుమానిస్తున్నారు. ప్రభావిత భవనానికి ఎదురుగా ఉన్న నగల దుకాణం రాత్రి మూతపడిన అనంతరం, అక్కడి కొన్ని కుటుంబాలు హైటెన్షన్ వైర్ నుంచి కరెంట్‌ను కొక్కేల ద్వారా అక్రమంగా వినియోగిస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ లైన్‌ను ఉపయోగిస్తూ బాధిత కుటుంబం ఇంటి కరెంట్ మీటర్‌పై ఎక్కువ లోడ్ పడినట్లు

...మిగతా 2లో

## ప్రజలపై భారం మోపినా ఫలితం శూన్యం..

# కొత్త ఇసుక పాలసీ బూమరాంగ్!

సర్కారుకు రూ.100 కోట్లు తగ్గిన ఆదాయం

అధికారులపై సీఎం రేవంత్‌రెడ్డి చిర్రుబుర్రు

పాలసీపై పునరాలోచనలోపడ్డ అధికారులు?



2

## హైడ్రా డ్రైవర్ ఉద్యోగాలకు పోటెత్తిన యువత..

- హైడ్రా పార్కింగ్ కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో బారులు తీరిన యువత
- హైడ్రాలో ఔట్స్ సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరణ
- నేటి నుంచి రెండు రోజులపాటు దరఖాస్తులు స్వీకరించనున్న హైడ్రా
- కానిస్టేబుల్ పరీక్షలో స్వల్ప మార్కులతో తేడాతో దూరమైన వారికి ప్రాధాన్యత

HYDRAA



2

# జ్యోతి మల్హోత్రా తండ్రి ఏమన్నారంటే?

- హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా అరెస్టు
- పాక్ తరఫున గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలు
- జ్యోతి మల్హోత్రా గురించి సంచలన విషయాలు బయటపెట్టిన తండ్రి..
- వెలుగులోకి అనేక దిగ్భ్రాంతికరమైన విషయాలు

**హర్యానా మే 19(ప్రజాక్షేత్రం):**

హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా అరెస్టు అందరినీ ఆశ్చర్య పరిచింది. పాకిస్థాన్ తరఫున గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలపై అరెస్టు అనంతరం అనేక దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. జ్యోతి పాకిస్థాన్, చైనాతో సహా అనేక దేశాలకు ప్రయాణించిందని చెబుతున్నారు. కేవలం రూ.20,000 ఉద్యోగంతో జీవితం ప్రారంభించిన జ్యోతి, ఇప్పుడు ప్రసిద్ధ యూట్యూబర్‌గా మారింది. కానీ ఆమెను ఎందుకు అరెస్టు చేశారు? విదేశాలకు వెళ్ళే ముందు ఆమె తన కుటుంబానికి ఏమి చెప్పింది? పాకిస్థానీ స్నేహితుల గురించి కుటుంబానికి తెలుసా? ఇలాంటి అనేక ప్రశ్నలను జ్యోతి తండ్రి హరీష్ మల్హోత్రా మాటల్లో తెలుసుకుందాం..

**ప్రశ్న:** మీ కూతురిని ఎందుకు అరెస్టు చేసి తీసుకెళ్లారని మీరు అనుకున్నారు? ఆ సమయంలో మీరు ఇంట్లో ఉన్నారా?

**జ్యోతి తండ్రి:** నేను ఇంట్లో లేను. గురువారం పోలీసులు జ్యోతి తీసుకెళ్లారు. ఆమెకు సంబంధించిన వస్తువులను కూడా తీసుకెళ్లారు.

**ప్రశ్న:** మరి ఇదంతా ఎందుకు జరుగుతోంది. ఇంతకీ ఏం చేశావని మీరు జ్యోతిని అడిగారా?

**జ్యోతి తండ్రి:** అడిగినా.. ఆమె నాకు ఏం చెప్పలేదు.

**ప్రశ్న:** ఇదంతా జరుగుతుంటే.. ఓ తండ్రిగా మీకు భయం వేయలేదా?

**జ్యోతి తండ్రి:** నేను చాలా ఆందోళన చెందాను. భయం వల్ల నాకు నిద్ర కూడా పట్టలేదు. ఈ విషయాలు బయటకు వచ్చిన తర్వాత నాకు జ్వరం కూడా వచ్చింది.

**ప్రశ్న:** జ్యోతి మీతో ఏదైనా చెప్పే ఉంటుంది కాదా?

జ్యోతి తండ్రి: "నాన్న, ఏదో తప్పు జరిగింది. పరిస్థితి అంతా బాగానే ఉంది. మీరు దిగులు చెందకండి." అని చెప్పింది. ఇంకేమీ చెప్పలేదు.

**ప్రశ్న:** ఒక తండ్రిగా ఆమె మీకు చెప్పాల్సిన అవసరం ఉంది కాదా? చెప్తే మీరు బాధపడతారని ఆమె అనుకుందా?

**జ్యోతి తండ్రి:** అవును, అదే అయి ఉండవచ్చని అనుకుంటున్నా..




# హైడ్రా డ్రైవర్ ఉద్యోగాలకు పోటెత్తిన యువత..

- హైడ్రా పార్కింగ్ కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో బారులు తీరిన యువత
- హైడ్రాలో ఔట్స్ సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరణ
- నేటి నుంచి రెండు రోజులపాటు దరఖాస్తులు స్వీకరించనున్న హైడ్రా
- కానిస్టేబుల్ పరీక్షలో స్వల్ప మార్కులతో తేడాతో దూరమైన వారికి ప్రాధాన్యత

**హైదరాబాద్ మే 19(ప్రజాక్షేత్రం):**

ఇటీవల తెలంగాణలోని హైడ్రా సంస్థ (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొడక్షన్ ఏజెన్సీ).. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 200 డ్రైవర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. సోమవారం నుంచి బుధవారం (మే 19, 21) వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపింది. ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలు రాసి.. స్వల్ప మార్కుల తేడాతో దూరమైన వారికీ ప్రాధాన్యత ఇస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొంది. దీంతో రాష్ట్రంలోని నిరుద్యోగులు ఒక్కసారిగా పోటెత్తారు. హైడ్రా పార్కింగ్ కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో బారులు తీరారు.

ఈ ఉద్యోగాలకు అప్లై చేసుకునేందుకు అన్ని జిల్లాల నుంచి భారీగా యువత తరలి వచ్చారు. ఇవాళ ఉదయం 10గంటల నుంచి క్యూలైన్లో నిలబడి దరఖాస్తు చేసుకున్నారు. హైడ్రా గతంలో కూడా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పలు నియామకాలు చేపట్టింది. 2025 ఫిబ్రవరి నెలలో డీఆర్ఎఫ్ లోకి 357 కొత్త ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించింది. ఈ ఉద్యోగులు అంబర్ పేట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో వారం రోజుల శిక్షణ అనంతరం ఫీల్డ్ లోకి పంపారు.

**పోస్టుల వివరాలు ఎలా ఉన్నాయి:**

మొత్తం పోస్టుల సంఖ్య : 200

అర్హతలు: తెలంగాణలో గతంలో విడుదలైన పోలీస్ రిక్రూట్మెంట్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకొని ఫైనల్ రాత పరీక్ష రాసి, ఎంపిక కాని అభ్యర్థులకు ప్రాధాన్యత.

**ఉద్యోగం పేరు: డ్రైవర్ పోస్టులు**

టెంపరరీ: ఔట్సోర్సింగ్ విధానంలో ఈ 200 ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారు.

ఎంత జీతం : విడుదలైన ప్రకటనలో జీతం వివరాలు తెలుపలేదు.

సెలక్షన్ ప్రాసెస్: ఎటువంటి రాత పరీక్ష లేకుండా అర్హతలు కలిగిన అభ్యర్థులకు అవుట్సోర్సింగ్ విధానంలో ఉద్యోగాల భర్తీ.

**నోటిఫికేషన్ ముఖ్యమైన తేదీలు:**

దరఖాస్తులు ప్రారంభ తేదీ : 19th మే, 2025.

దరఖాస్తులు ఆఖరి తేదీ : 21st మే, 2025


దరఖాస్తు ఫీజు: ఎటువంటి ఫీజు లేదు



# తెలంగాణలో భారీ వర్షాలు.. హెచ్చరించిన ఐఎండీ

**హైదరాబాద్ మే 19(ప్రజాక్షేత్రం):**

బంగాళాఖాతంలో ఏర్పాడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మరో నాలుగు రోజులపాటు తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలిపింది. నేడు కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణ్‌పేట్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ, గద్వాల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాల్లో ఎల్లో అలర్ట్స్ జారీ చేసింది. వర్షాల కారణంగా ఎండ తీవ్రత తగ్గనుంది. పగటిపూట ఉష్ణోగ్రతలు ఐదు డిగ్రీల మేర తగ్గే అవకాశముంది.



**చురుగ్గా నైరుతి రుతుపవనాలు**

బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో నైరుతి రుతుపవనాలు మరింత వేగంగా విస్తరిస్తున్నాయి. రెండు మూడు రోజుల్లో దక్షిణ అరేబియా, మాల్దీవులు, కొమోరిన్ సహా బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. మరోవైపు మధ్య మహారాష్ట్ర సహా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ వరకు 0.9 కి.మీ ఎత్తులో ఓ ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా కర్ణాటక వరకు మరో ద్రోణి కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రానున్న 24 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది.

మరోవైపు అంచనా వేసిన సమయానికంటే ముందుగానే రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశమున్నట్లు భారత వాతావరణశాఖ వెల్లడించింది. ప్రస్తుతం అండమాన్ నికోబార్ దీవుల్లో రుతుపవనాలు పూర్తిగా విస్తరించి ఉన్నాయి. తొలుత ఈ నెల 27న కేరళ తీరాన్ని తాకుతాయని ఐఎండీ అంచనా వేసింది. అయితే, కాస్త ముందుగా 24నే కేరళ తీరంలోకి ప్రవేశించి, జూన్ మొదటి వారంలోనే తెలంగాణలోకి ప్రవేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదం వెనుక అక్రమ కరెంట్ కనెక్షన్..!

**మొదటిపేజీ తరువాయి**

తెలుస్తోంది. ఆలోచించదగ్గ విషయమేమంటే, అదే లోడ్ కారణంగా మీటర్‌బాక్స్‌లో మంటలు చెలరేగినట్టు.. ఆ మంటలు మొదట మీటర్ బాక్స్‌లో వచ్చి, ఆ బాక్స్ పక్కన ఉన్న ఉడెన్ షోకేజ్‌ను అంటుకున్నాయి.

అక్కడ నుంచి మంటలు మరింతగా వ్యాపించి ఏసీ కంప్రెసర్ వరకు తాకాయి. అప్పటికే భవనంపై అంతస్తుల్లో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులు ఏమీ గ్రహించకుండానే మంటలు ఇంటి అంతటా విస్తరించాయి. ఈ ప్రమాదానికి కారణమైన అక్రమ కరెంట్ కనెక్షన్లపై పోలీసులు, ఫైర్ సిబ్బంది ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించారు. హైటెన్షన్ లైన్ల నుంచి వ్యక్తిగతంగా కరెంట్ తీసుకోవడాన్ని గమనించి, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో స్థానికంగా మరిన్ని ఇలాంటి అక్రమ కనెక్షన్లున్నాయా అనే దానిపై విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనతో చిన్నచిన్న నిబంధనల ఉల్లంఘన ఎంతటి ప్రాణ నష్టం కలిగించగలదో మరోసారి తేలిపోయింది. అక్రమ కరెంట్ కనెక్షన్లపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఇంకా తీవ్రమైంది.




# అందాల పోటీలకైతే 300 కోట్లు.. పుష్కరాలకు రూ.35 కోట్లేనా?

- 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే పుష్కారాలు
- పుష్కర స్నానం చేయడం చాలా సంతోషంగా ఉంది
- ప్రభుత్వం పెద్ద పుష్కర పండగకు రూ.35 కోట్లిచ్చింది
- అందాల పోటీలకు మాత్రం రూ. 300 కోట్లు విడుదల చేశారు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు

**హైదరాబాద్ మే 19(ప్రజాక్షేత్రం):**

12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే పుష్కారాల స్నానం చేయడం చాలా సంతోషంగా ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద పుష్కర పండగకు విడుదల చేసిన 35 కోట్ల రూపాయలు ఏర్పాట్లకు సరిపోవన్నారు. యూపీ రాష్ట్రంలో కుంభమేళా కు 50 కోట్ల మందికి బీజేపీ ప్రభుత్వం సరిపడ నిధులు విడుదల చేసి ఘనంగా నిర్వహించిందని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. పుష్కరాలను కుంభమేళ తరహాలో కోట్లాది మందిని తరలించి ఘనంగా నిర్వహించే వాళ్ళమని చెప్పారు. అందాల పోటీలకు రూ. 300 కోట్లు విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్యాత్మికతకు రూ. 35 కోట్లు వెచ్చించడం ఏంటి? అని ప్రశ్నించారు.

పుష్కరాలను ఈ ప్రాంతానికి పరిమితి చేయడం పద్ధతి కాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. వచ్చే పుష్కరాలకు ఎక్కువ బడ్జెట్ విడుదల చేసి ఘనంగా నిర్వహించాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగడంతో కాళేశ్వరానికి చెడ్డపేరు వచ్చిందని.. పుష్కరాలతోనైన మంచి పేరు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ముక్తీశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వం కోట్లు వెచ్చించిన నిధులు విడుదల చేయలేదని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన రూ. 200 కోట్ల హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

# మంత్రి పదవి కోసం కొత్త ఎత్తులు..

- ముఖ్య నేతలను మంచి చేసుకునే పనిలో రాజగోపాల్‌రెడ్డి!
- సీనియర్లతోనూ సత్సంబంధాలు
- మారిన వైఖరిపై కాంగ్రెస్‌లో చర్చ

**హైదరాబాద్ మే 19(ప్రజాక్షేత్రం):**

మంత్రి పదవి కోసం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సరికొత్త వ్యూహాలకు పదును పెడుతున్నారు. తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటున్నారని అనుమానిస్తున్న పార్టీలోని పలువురు కీలక నేతలను మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల నల్లగొండలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ముఖ్యమంత్రి అయ్యే అర్హత ఉన్నదని వ్యాఖ్యానించారని, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఒక కార్యక్రమానికి స్వయంగా ఆహ్వానించారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

నల్లగొండ జిల్లా రాజకీయాల్లో ఉత్తమ్, కోమటిరెడ్డి కుటుంబా ల మధ్య రాజకీయ సంబంధాలు అంతంత మాత్రమే. అయితే, ఏఐసీసీ ఉత్తమ్ అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తుండటం, ఆయనను మచ్చిక చేసుకొనేందుకు పొగుడుతున్నారని ఆయన అనుచరులు చెప్తున్నారు. మరోవైపు గుత్తా, కోమటిరెడ్డి కుటుంబాల మధ్య కూడా సఖ్యత లేదు. అయితే, అందరితో మంచిగా ఉండటం ద్వారా రాబోయే రోజుల్లో మంత్రి పదవి పొందడానికి ఎలాంటి అడ్డంకులు ఉండవనే ఉద్దేశంతోనే గుత్తాతో కూడా స్నేహ సంబంధాల కోసం ప్రయత్నిస్తున్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

సీనియర్ నేత జానారెడ్డి రాసిన లేఖ వల్లే తనకు మంత్రిపదవి రాకుండా పోయిందనే ఉద్దేశంతో ఆయనపై రాజగోపాల్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై జానారెడ్డి నేరుగా స్పందించకపోయినా.. అధిష్ఠానం ఈ వ్యాఖ్యలపై వివరణ కోరినట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరిగింది. దీంతో జానారెడ్డి అంటే తనకు చాలా గౌరవమని, వ్యక్తిగతంగా ఆయనను విమర్శించలేదని రాజగోపాల్‌రెడ్డి చెప్పుకున్నారు. ఆ తర్వాత మళ్లీ జానారెడ్డిని మచ్చిక చేసుకునేందుకు ఆయన తనయులు ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డితో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్నారని, జానారెడ్డితో రాజగోపాల్‌రెడ్డికి మంచి సంబంధాలు ఉన్నాయని ఆయన అనుచరులు చెప్తున్నారు.

# కాళేశ్వరం కమిషన్ గడువు మరోసారి పొడిగింపు

- కాళేశ్వరం కమిషన్ గడువు మరో రెండు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు
- మే 31తో ముగియనున్న కాళేశ్వరం కమిషన్ పదవీ కాలం
- బహిరంగ విచారణను ముగించినట్లు ప్రకటించిన కమిషన్ వర్గాలు
- విచారణ గడువును జూలై 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్ మే 19(ప్రజాక్షేత్రం):**

కాళేశ్వరం కమిషన్‌లో బిగ్ ట్విస్ట్ నెలకొంది. కాళేశ్వరం కమిషన్ గడువు మరో రెండు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మే 31తో కాళేశ్వరం కమిషన్ పదవీ కాలం ముగియనుంది. బహిరంగ విచారణను ముగించినట్లు కమిషన్ వర్గాలు ప్రకటించాయి. కాళేశ్వరం కమిషన్ విచారణ గడువును జూలై 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది రాష్ట్ర ప్రభుత్వం. రాజకీయ నాయకుల విచారణ లేకుండానే నివేదిక ఇచ్చేందుకు కమిషన్ సిద్ధమైంది. పీసీ ఘోష్ కమిషన్ పదవీ కాలం పెంపుతో మళ్ళీ విచారణ కొనసాగించే అవకాశం ఉంది. కేసీఆర్, హరీష్‌రావు, ఈటెల రాజేందర్ ను విచారించేందుకే కాళేశ్వరం కమిషన్ పదవీ కాలం పొడిగించారంటున్న ఇరిగేషన్ శాఖ వర్గాలు చెబుతున్నాయి.



కాగా, కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కోసం కమిషన్ గడువును ఈ నెల 31 వరకు తెలంగాణ ప్రభుత్వం పొడిగించిన సంగతి తెలిసిందే. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంలో లోపాలపై విచారణ కోసం ప్రభుత్వం గత ఫిబ్రవరిలో కమిషన్‌ను నియమించగా, 100 రోజుల్లో నివేదిక సమర్పించాలని సూచించింది. ఆ తర్వాత క్రమంగా కమిషన్ గడువును పొడిగిస్తూ వచ్చింది. తాజాగా మరోసారి జూలై 31 వరకు గడువు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మరోవైపు.. కాళేశ్వరం కమిషన్ విచారణ ముగిసిందని చెబుతున్నారు. బహిరంగ విచారణకు పొలిటికల్ లీడర్లను విచారణకు పిలువొద్దని కమిషన్ సూత్రప్రాయంగా నిర్ణయించింది. దీంతో కేసీఆర్, హరీష్‌రావు, ఈటల రాజేందర్‌కు ఊరట లభించినట్లైంది. లీగల్ సమస్యలు రాకూడదనే ఉద్దేశ్యంతో వారిని విచారణకు పిలవకూడదని నిర్ణయం తీసుకుంది. డాక్యుమెంట్ ఆధారాలతో కమిషన్ ఫైనల్ రిపోర్ట్ ఇవ్వనుంది. దాదాపు 4వందల పేజీల రిపోర్ట్‌ను కమిషన్ తయారు చేసింది. ఈనెల 20 తర్వాత రిపోర్టు ఇవ్వనున్నట్లు తెలిసింది. కాగా.. అంతలోనే మరోసారి గడువు పొడిగించారు.

# కొత్త ఇసుక పాలసీ బూమరాంగ్!

- ప్రజలపై భారం మోపినా ఫలితం శూన్యం..
- సర్కారుకు రూ.100 కోట్లు తగ్గిన ఆదాయం
- అధికారులపై సీఎం రేవంత్‌రెడ్డి చిర్రుబుర్రు
- పాలసీపై పునరాలోచనలోపడ్డ అధికారులు?

**హైదరాబాద్ మే 19(ప్రజాక్షేత్రం):**

కొండ నాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడిపోయినట్టుగా మారింది ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఇసుక పాలసీ. నూతన విధానంతో భారీ ఆదాయం వస్తుందన్న ప్రభుత్వ పెద్దలు, అధికారులు మాటలు తప్పని తేలిపోయింది. ఖజనాకు కాసుల గలగల ఏమోగానీ వెలవెలబోయేలా చేసింది. కొత్త ఇసుక పాలసీ తలకిందులైంది. భారీ రాబడి సంగతి పక్కన పెడితే ఆదాయం తగ్గిపోయింది. ప్రజలపై టన్ను ఇసుకకు రూ.500 వరకు అదనపు భారం మోపినప్పటికీ ప్రభుత్వానికి రావాల్సినంత ఆదాయం రాలేదు. నిరుడితో పోల్చుకుంటే రూ.100 కోట్లకుపైగా ఆదాయం తగ్గిపోయింది. అధికారుల అత్యుత్సాహం ఫలితంగా ఇసుకకు కృత్రిమ కొరత ఏర్పడి నిర్మాణ రంగంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడింది... కొత్త ఇసుక పాలసీ బెడిసికొట్టింది.

**సర్కారు అత్యుత్సాహం.. తగ్గిన ఆదాయం**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇసుక అమ్మకం ద్వారా టీజీఎండీసీకి ఏటా సుమారు రూ.800 కోట్లకుపైగా ఆదాయం సమకూరేది. మార్కెట్‌లో ఎప్పుడూ ఇసుకకు కొరత ఏర్పడలేదు. బహిరంగ మార్కెట్‌లో పుష్కలంగా ఇసుక లభించేది. ఇసుక సరఫరాదారుల మధ్య పోటీ ఉండడంతో ఇసుక ధర టన్నుకు రూ.1,400 దాటలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిస్థితి తారుమారైంది. అక్రమాలను అరికడతామంటూ ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీ తీసుకొచ్చింది. తనిఖీల పేరుతో ఇసుక క్వారీలు సజావుగా నడవకుండా చేశారు. ఇసుక లారీలపై ఆంక్షలు విధించారు. వినియోగదారులే నేరుగా బుకింగ్‌లు చేసుకోవాలనే నిబంధన విధించారు. ఆన్‌లైన్ బుకింగ్‌లు జరగకుండా సాంకేతిక సమస్యలు సృష్టించి దళారులను రంగంలోకి దింపారు. ఇసుకబజార్లను ఏర్పాటుచేసి అధికారికంగానే రూ.1,800 ధర ఖరారు చేశారు. జీఎస్టీ, రవాణా ఖర్చులు కలుపుకొని టన్ను ఇసుక ధర రూ.2,000 దాటిపోయింది. ఒకప్పుడు రూ.1,400లకు ఇంటి వద్దకు చేరాల్సిన ఇసుకకు ఇప్పుడు రూ.2,000 ఖర్చు పెట్టాల్సి వస్తున్నది. అయినా గతంలో మాదిరిగా అందుబాటులో ఉండడంలేదు. శాండ్‌బజార్లలో నాసిరకం ఇసుకను ఉంచడంతో వినియోగదారులకు నాణ్యమైన ఇసుక దొరకడమే గగనమైంది. కొత్త ఇసుక పాలసీ బెడిసికొట్టినా ప్రభుత్వంలో చలనం రాలేదని నిర్మాణరంగ నిపుణులు విమర్శిస్తున్నారు. ఇసుక ధరలు ఆకాశాన్నంటుతున్నా ప్రభుత్వం స్పందన కరువైందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

**ధర పెరిగినా తగ్గిన ఆదాయం**

ప్రభుత్వం వినియోగదారులపై భారం మోపినా ఖజానాకు రాబడి మాత్రం పెరగలేదు. గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లకుపైగా ఆదాయం తగ్గిపోయింది. ప్రతినెలా సగటున రూ.70కోట్ల వరకూ ఆదాయం రావాల్సి ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి నెల అయిన ఏప్రిల్‌లో రూ. 40 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది.

**పునరాలోచనలో అధికారులు**

శనివారం టీజీఎండీసీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సందర్భంగా ఇసుక ఆదాయం తగ్గడంపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. కొత్త పాలసీ తీసుకొచ్చిన ప్రభుత్వ పెద్దలు.. ఇప్పుడు పరిస్థితి తలకిందులు కావడంతో తమను బాధ్యులు చేయడమేంటని కొందరు అధికారులు వాపోతున్నారు. ఆదాయం ఎలా పెంచాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. శాండ్ బజార్లలో ఇసుక ధరలు తగ్గించాలా? బహిరంగ మార్కెట్‌లో ఇసుక మరింత అందుబాటులోకి వచ్చేలా చేయాలా? అని అధికారులు ఆలోచనలో నిమగ్నమైనట్టు తెలుస్తున్నది. ప్రభుత్వం, అధికారులు ఇసుక కృత్రిమ కొరతను సృష్టించడం మానుకోవాలని ప్రజలు, నిర్మాణదారులు కోరుతున్నారు.

**మధ్యతరగతి బడ్జెట్ తారుమారు**

ఇసుక ధర రూ.2,000లకు చేరుకోవంతో భవన నిర్మాణాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతున్నది. బడా బిల్డర్లు వినియోగదారులపై భారంమోపి తమ ఖర్చులు రాబట్టుకుంటారు. కానీ వ్యక్తిగత గృహాలు నిర్మించుకునే మధ్యతరగతి ప్రజల బడ్జెట్ తారుమారవుతున్నది. చాలామంది నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేస్తున్నారు. 100 గజాల్లో రెండు గదుల ఇల్లు నిర్మించుకునేవారిపై సైతం ఇసుక ధర పెరగడంవల్ల రూ.లక్షకుపైగా అదనపు భారం పడినట్టు చెప్తున్నారు.

# వరి వేస్తే ఉరి కాదు.. వరి వేస్తే సిరి!

**మొదటిపేజీ తరువాయి**

సందర్శించిన సీఎం, తర్వాత బహిరంగ సభలో పాల్గొని మాట్లాడుతూ, నల్లమల బిడ్డగా ఈ గడ్డపై నుంచి మాట్లాడుతుంటే గుండె ఉప్పొంగుతున్నదని చెప్పారు.

**అభివృద్ధే లక్ష్యం**

అచ్చంపేట నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎన్నికల సమయంలో మాట ఇచ్చిన విషయాన్ని రేవంత్ గుర్తు చేశారు. అప్పుడు ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు అధికారులకు సూచనలు చేశానని, నియోజకవర్గంలో రైతులందరికీ సోలార్ పంపు సెట్లు అందిస్తామన్నారు. వంద రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.60 వేల కోట్లను రైతుల కోసం ఖర్చు చేసినట్టు వివరించారు.

**బీఆర్ఎస్‌పై నిప్పులు**

పోడు భూములపై పోరాటం చేసిన వారిని జైల్లో పెట్టిన చరిత్ర గత ప్రభుత్వానిదైతే, సోలార్ పంపు సెట్లను అందించి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న ఘనత ప్రజా ప్రభుత్వానిదని సీఎం రేవంత్ అన్నారు. సన్నాలు పండించే రైతులకు మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ ఇస్తున్నామని చెప్పారు. వరి వేస్తే ఊరే అనే పరిస్థితుల నుంచి వరి వేస్తే సిరి అనే పరిస్థితులను కల్పించామని తెలిపారు. పేదలందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తూ వారి ఆత్మగౌరవం పెంచామని, రాష్ట్రంలో 3 కోట్ల 10 లక్షల మందికి అందిస్తున్నామన్నారు. అదానీ, అంబానీలతో పోటీ పడేలా ఆడబిడ్డలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని వివరించారు. తెలంగాణను దేశంలోనే ధనిక రాష్ట్రంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడా లేని విధంగా ఏడాదిలో 60 వేల ఉద్యోగ నియామకాలను భర్తీ చేసినట్టు తెలిపారు. కొంతమంది తమ అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని విమర్శలు చేశారు. కడుపునిండా విషం పెట్టుకుని విష ప్రచారం చేసే వారిని తాను పట్టించుకోనని స్పష్టం చేశారు. "పేదల ఆకలి తీర్చే సన్న బియ్యం మేమేం చేస్తున్నామో గుర్తు చేస్తుంది. పాసు పుస్తకాలు చూసినప్పుడల్లా రైతులుకు రుణమాఫీ చేసిన రేవంతన్న గుర్తొస్తాడు.



బస్సులో ఉచిత ప్రయాణం చేసిన ఆడబిడ్డలకు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందుతున్న పేదలకు మా ప్రభుత్వం చేసే మంచి పనులు ఎప్పటికీ గుర్తుంటాయి. ఎవరెన్ని కుట్రలు పన్నినా, తప్పుడు ప్రచారాలు చేసినా ప్రభుత్వ పథకాలే ప్రజలకు నిజాలను చెబుతాయి. అలాంటివారికి ప్రజలే బుద్ధి చెబుతారు" అని వ్యాఖ్యానించారు.

**పథకం ప్రారంభంపై సర్వత్రా హర్షం**

"ఇందిర సౌర గిరి జల వికాసం" పథకం ప్రారంభించడం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సోలార్ పంపు సెట్లతోపాటు పొలంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని అదనపు ఆదాయం అందేలా చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. పరిసర ప్రాంతాల గిరిజనులకు లబ్ధిదారులు పథకంపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అదనపు ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ పంపు సెట్ల స్థానంలో సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేయాలని సూచనలు చేశారు. వంద రోజుల్లో రైతులందరికీ సోలార్ పంపు సెట్ల ఏర్పాటు పూర్తి చేయాలని, ఇందుకోసం స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు చెప్పారు.



## మదిగట్ల జడ్పీహెచ్ఎస్ లో సమ్మర్ క్యాంపు సంబరాలు

**జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ గని**

**పెద్దమందడి మే 19(ప్రజాక్షేత్రం):** పెద్దమందడి మండలం మద్దిగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్ ముగింపు సమావేశము, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపులో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మద్దిగట్ల, మోజర్ల, పెద్దమందడి, మండలం నందు ఈరోజు ముగింపు కార్యక్రమము నిర్వహించబడినది. సమ్మర్ క్యాంపు ముగింపు సభకు ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ గని, మండల ఎంఈఓ బాణం విష్ణు హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ గని సభను ఉద్దేశించి మాట్లాడాడుతూ... గత 15 రోజుల నుండి పాఠశాలకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని, పలు ప్రదర్శనలు నిర్వహించడం జరిగింది. యోగా, మరియు మెడిటేషన్ ఇందులో భాగంగా విద్యార్థులు ఆసనాలు మరియు ధ్యానం కు సంబంధించిన పలు అంశాలను ప్రదర్శించడం జరిగింది. గ్లాస్ పెయింటింగ్ లో భాగంగా గ్లాస్ పై బొమ్మలు వేయడం చాలా అద్భుతంగా చేశారని విద్యార్థులను ప్రశంసించారు. ఇందులో అమర జవాన్ మురళి నాయక్, పుష్పాలు, ఏనుగు, తెలంగాణ తల్లి, వనపర్తి జిల్లా విద్యాధికారి అబ్దుల్ గని చిత్రపటం మరియు, గాజు సీసాల పై వివిధ రకాల చిత్రాలు వేయడం జరిగింది. డ్రాయింగ్ కు సంబంధించి మన జవాన్లు పాకిస్థాన్ పై ప్రదర్శించిన ధైర్య సాహసాలు, రైతులు వేసే పంటలు, మహాత్మా గాంధీ చిత్రపటం, తల్లుల దినోత్సవం చిత్రపటం, శ్రీకృష్ణ భగవానుని చిత్రపటం మొదలగునవి వేయడం జరిగిందని విద్యార్థులను కొనియాడారు. బాణం విష్ణు మాట్లాడుతూ, నాట్య ప్రదర్శనలో భాగంగా ఏకదంతాయ అనే పాటకు, మట్టిని తాగిన చేతులు అనే పాటకు, రఘుకుల తిలకా రారా అనే పాటకు, నీ గుడి ముందాల అనే పాటకు, సరిలేరు నీకెవ్వరు అనే పాటలకు డాన్స్ మాస్టర్ రవి శిక్షణ ద్వారా అద్భుతంగా నాట్య ప్రదర్శన చేయడం జరిగింది ని అన్నారు. హెచ్ఎంఎస్ వరప్రసాదరావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని, ఈ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం జరిగిందన్నారు. పెద్దమందడి మండలంలో మూడు ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, అన్ని పాఠశాలలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిందన్నారు. విద్యార్థులు ఈ వేసవి శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొనుటకు ప్రత్యేక కృషి చేసిన, వాలంటీర్లు రాధా అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, నందిని ఎస్ రాధా రవి లను, మండల ఎంఈవో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో... ఎంఈఓ బాణం విష్ణు, పాఠశాల హెచ్ఎం. ఎస్.వరప్రసాదరావు, మరియు ఉపాధ్యాయులు డి.రణధీవ్, పి.వెంకటస్వామి, కె. మధుసూదన్, చిన్నారెడ్డి, సి అర్ పి సేవ్య నాయక్, వాలంటీర్లు రాధా, నందిని, ఎస్.రాధ, రవి, మరియు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.



## అకాల వర్షానికి కూలిన పేదోడి ఇల్లు

**సిద్దిపేట జిల్లా మే 19(ప్రజాక్షేత్రం):** సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలో ఆదివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది, ఈదురు గాలులకు పలు గ్రామాల్లో భారీనష్టం కలిగించింది, ఇండ్ల రేకులు ఎగిరిపడ్డాయి చెట్లు నేల కూలిపోవడంతో పాటు.. విద్యుత్ స్తంభాలు ఒరిగిపడ్డాయి, దీంతో సిద్దిపేట జిల్లాలో తీవ్ర నష్టం కలిగించింది. ఈ క్రమంలోనే దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేట 9 వ వార్డుకు చెందిన జనగామ చంద్రం ఇంటిపై చెట్టు విరిగి పడటం తో కూలి పని చేసుకుంటూ బ్రతికే ఆ పేదోడి గూడు కూలిపోయింది. అతని కున్న చిన్నపాటి ఇంటిపై పెద్ద వేప చెట్టు పడడంతో ఆ ఇల్లు పూర్తిగా ధ్వంసం అయింది. దీంతో ఉండడానికి ఇల్లు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్న చంద్రం తమను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా దుబ్బాక తహసీల్దార్ ఈ సంజీవ్ కుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ హరికిషన్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మండలంలోని హబ్సిపూర్ పిట్టల వాడలో 7 గుడిసెలు పాక్షికంగా ధ్వంసం అయి నట్లు ఎమ్మార్వో సంజీవ్ కుమార్ తెలిపారు.




## పాఠశాల విద్యాశాఖ రంగారెడ్డి జిల్లా తెలంగాణ రైజింగ్ ఉచిత వేసవి శిక్షణ శిబిరం

**శంకర్ పల్లి మే 19(ప్రజాక్షేత్రం):** శంకర్ పల్లి మండల పరిధిలోని మొకిల్ల తాండ లో మే 5 2025 నుండి 19 మే, 2025 వరకు 15 రోజుల పాటు జరిగిన వేసవి శిక్షణ శిబిరాన్ని శంకర్ పల్లి మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్ సందర్శించడం జరిగింది. వారు ఈ సందర్భంగా శిక్షణా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి కార్యక్రమాన్ని మన శంకర్ పల్లి మండలంలో విజయవంతంగా కొనసాగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పఠనాసక్తి, చిత్రలేఖనము, యోగధ్యానం, డ్రాయింగ్, పెయింటింగ్, చేతివ్రాత, క్రీడలు వంటి పలు అంశాల్లో తర్ఫీదు నివ్వడం జరిగిందని తెలిపారు. మరి ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల వైపు గ్రామంలోని పిల్లలందరినీ మళ్లించి పాఠశాలలో నమోదు శాతాన్ని పెంచడానికి ఈ సమ్మర్ క్యాంపు ఎంతగానో దోహదపడుతుందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులందరికీ ప్రింటెడ్ కాపీ రైటింగ్ కు సంబంధించినటువంటి తెలుగు, ఆంగ్లంనకు సంబంధించినటువంటి నోటు పుస్తకాలను అందజేయడం జరిగింది. నేటితో ఈ శిక్షణ శిబిరం ముగిసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోకిల తాండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి రాములు, ఉపాధ్యాయులు కే శివకుమార్ మండల సీనియర్ ఉపాధ్యాయులు పి ఆశీర్వాదం గ్రామ యువకులు మహేష్ నాయక్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# కిలో రూ.40కి కొంటామని, తీరా వచ్చాక రూ.10 ఇస్తామన్నారు

- విసుగొచ్చిన ఆ రైతు ఏం చేశాడో చూడండి
- కనీస ధరలు చెల్లించకపోవడంతో రైతు ఆవేదన
- పండించిన పంటను నడి రోడ్డుపై పారబోసిన వైనం
- మార్కెట్లో వ్యాపారులు మోసం చేస్తున్నారని వాపోయిన రైతులు

**హనుమకొండ మే 19(ప్రజాక్షేత్రం):**

ఆరుగాలం కష్టించి పంట పండించే రైతన్నలను దళారులు, వ్యాపారులు ఇలా దోచుకుంటారనేందుకు హనుమకొండ జిల్లా పరకాలలో జరిగిన ఓ ఘటన ఉదాహరణగా నిలుస్తుంది. సరుకు తీసుకుంటామని ఆశపెట్టి తీరా వచ్చాక ధర లేదని రూపాయికి పావులా ఇస్తామని మోసం చేసే దళారులు, వ్యాపారులు ఎందరో. తీరా అంత దూరం వచ్చాక సరుకు తిరిగి తీసుకుపోవడం ఇష్టం లేక అంతో ఇంతో అమ్ముకునే రైతులే ఎక్కువ. కానీ ఈ రైతు మాత్రం కడుపుమండి తెచ్చిన పంటను రోడ్డుపై పోసి నిరసన వ్యక్తం చేశాడు.

**మంచి ధర వస్తుందని**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ముచ్చిపర్తికి చెందిన రవీందర్ రెడ్డి తన పొలంలో వంకాయలను పండించారు. ఆదివారం కాసిన వంకాయలను అమ్ముకునేందుకు మార్కెట్లో వ్యాపారికి ఫోన్ చేశాడు. ఆ వ్యాపారి కిలోకు రూ.40 చొప్పున కొంటాను, తీసుకురావాలని సూచించాడు. తీరా తీసుకొచ్చాక ధర లేదని కిలోకు పది రూపాయలే ఇస్తాననడంతో రవీందర్ రెడ్డి అవాక్కయ్యాడు. రైతుల కష్టాన్ని వ్యాపారులు దోచుకుంటున్నారని ఆగ్రహంతో రవీందర్ రెడ్డి తాను



తెచ్చిన వంకాయలను రోడ్డుపై పారబోసి నిరసన వ్యక్తం చేశాడు.

## తండ్రీ కొడుకుల మధ్య ఘర్షణ.. తీవ్ర గాయాలతో కొడుకు మృతి

**కామారెడ్డి మే 19(ప్రజాక్షేత్రం):** తండ్రీ కొడుకుల మధ్య జరిగిన ఘర్షణలో తీవ్ర గాయాలపాలైన కొడుకుకు మృతి చెందాడు. దేవునిపల్లి పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన వడ్ల నిఖిల్ (24) అనే వ్యక్తి గల్ఫ్ కు వెళ్లాడు. గత మూడు నెలల క్రితం స్వగ్రామమైన లింగాపూర్ కు వచ్చాడు. అప్పటినుంచి వడ్ల నిఖిల్ గంజాయి, మద్యానికి, కల్లుకు బానిస అయ్యాడు. దీంతో ప్రతిరోజు తల్లిదండ్రులతో అతను గొడవ పడేవాడు. ఈ క్రమంలో నిఖిల్ తన తండ్రి భాస్కర్ తో గొడవకు దిగాడు. ఇద్దరు ఘర్షణ పడడంతో తండ్రి భాస్కర్ ఇనుప రాడ్ తో కుమారుడు నిఖిల్ పై దాడి చేశాడు. దీంతో నిఖిల్ కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నిఖిల్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు దేవునిపల్లి పోలీసులు



కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కొడుకు నిఖిల్ మృతికి కారణమైన తండ్రి భాస్కర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



## మేము ఇద్దరం కాదు ఆరుగురం.. టిఫిన్ బాక్స్ బాంబుల తయారీ కోణం కలకలం..

**హైదరాబాద్ మే 19(ప్రజాక్షేత్రం):** హైదరాబాద్ లో టిఫిన్ బాంబులను పేల్చాలని ఐసిస్ సానుభూతి పరులు కుట్రపన్నారా....దీని కోసం ఉగ్రవాద స్లీపర్ సెల్స్ నగరంలో 3 రోజుల పాటు తిష్ట వేశారా... ఇక్కడ ఓ ఇంట్లో రహస్యంగా భేటీ అయ్యారా అనే అనుమానాలకు ఆంధ్రప్రదేశ్ , హైదరాబాద్ లో పట్టుబడిన ఇద్దరీ అరెస్టు కు సంబంధించిన రిమాండ్ రిపోర్టులో నమోదైన విషయాలు ఇప్పుడు కలకలం రేపుతున్నాయి. సోమవారం ఏపీ విజయనగరం పోలీసులు సయ్యద్ ఉర్ రహ్మాన్, సమీర్ లను రిమాండ్ కోసం కోర్టులో హాజరుపర్చారు. ఈ నేపథ్యంలో ప్రాథమికంగా విచారణ లో ఇద్దరు ఉగ్రవాద సానుభూతిపరులు చాలా ఆసక్తికరమైన విషయాలను వెల్లడించినట్లు సమాచారం. ఈ ఇద్దరు కాకుండా వీరితో మరో నలుగురు ఉన్నారనే విషయాన్ని తెలిపారు. అంతే కాకండు సౌదీ లోని ఐసిస్ కు చెందిన హ్యాండిలర్స్ ఇచ్చే ఆదేశాలను సారంగా పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు పోలీసులకు చెప్పినట్లు సమాచారం . ఈ నేపథ్యంలో సిరాజ్ ఉర్ రహ్మాన్ , సమీర్ లతో కలిసి మొత్తం ఆరుగురు హైదరాబాద్ లో మకాం వేసినట్లు బయటపడింది. సౌదీలోని ఐసిస్ ఉగ్రవాద్ హ్యాండిలర్స్ తో మాట్లాడేందుకు ఇన్ స్టాగ్రాంలో ఓ గ్రూపును ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది. టిఫిన్ బాక్సు బాంబుల తయారీ కోసం సిరాజ్ ఆమెజాన్ లో కొన్ని స్టీల్ టిఫిన్ బాక్సులను ఆర్డర్ చేసి తెప్పించుకున్నట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నట్లు సమాచారం. అంతేకాకుండా సిరాజ్ ను అరెస్టు చేసే విజయనగరంలోని అతని ఇంటి నుంచి అమ్మోనియం నైట్రేట్, సల్ఫర్ , అమ్మోనియం పౌడర్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిరాజ్ , సమీర్ లు టిఫిన్ బాక్సు బాంబులను తయారు చేయాలని ఐసిస్ హ్యాండిలర్స్ ఆదేశించగా, మరో నలుగురిని బాంబులను పెట్టేందుకు పని చేయాలని ఆదేశించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది. ఏపీ, తెలంగాణ, ఎన్ఐఏ అధికారులు అప్రమత్తంగా ఉండడంతో ఈ టిఫిన్ బాక్స్ బాంబుల కుట్ర భగ్నం అయ్యింది. నిందితులు ఇచ్చిన ప్రాథమిక సమాచారంతో పోలీసులు, ఎన్ఐఏ అధికారులు మిగతా నలుగురు కోసం గాలిస్తున్నారు, వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తే బాంబులు ఎక్కడెక్కడ పెట్టాలని రెక్కీ చేసిన విషయంతో పాటు ఇంకా అనేక కీలకమైన విషయాలు పోలీసులకు చిక్కే అవకాశం ఉంది. ఈ ఇద్దర్నీ మరోసారి కోర్టు అనుమతితో ఏపీ పోలీసులు కస్టడీలోకి తీసుకుని ఈ బాంబు పేలుళ్ల కుట్ర వెనకాల ఇంకా ఎంత మంది ఉన్నారనే రహస్యాన్ని పోలీసులు చేధించనున్నారు. ఈ కేసు దర్యాప్తు దేశ భద్రతకు ముడిపడి ఉండడంతో దర్యాప్తు అంశాలను పోలీసు అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. అధికారికంగా వివరాలను ధ్రువీకరించడం లేదు.

## రెండు బండ్లు,తులం బంగారం, 20 తులాల వెండి చోరీ

**కొమురవెల్లి మే 19(ప్రజాక్షేత్రం):** ఆదివారం18.05.2025 మధ్యరాత్రి, వేచరేణి గ్రామంలో గల ఇగుర్ల యాదవ్వ గారి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు బీరువాలో ఉన్న తులం బంగారం,20 తులాల వెండి దొంగలించినారు. వారి ఇంటి ముందు పార్కు చేయబడిన రెండు బండ్లు (టీవీఎస్ ఎక్సెల్ మరియు ప్యాషన్ ప్రో) లను కూడా ఎత్తుకెళ్లినారు. ఇట్టి విషయమై కొమురవెల్లి పిఎస్ నందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనైనది.



## హైదరాబాద్‌లో అగ్ని ప్రమాదాలు మంటల్లో 66 మంది మృతి

- వ్యాపార, నివాస సముదాయాలు కలిసి ఉన్న భవనాల్లోనే అగ్ని ప్రమాదాలు
- నివారణ చర్యలు తీసుకోవట్లేదని ఆయా శాఖలపై విమర్శలు
- గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాదం పెను విషాదం

**హైదరాబాద్ మే 19(ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్ నగరంలో అగ్ని ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. సగటున రోజుకు 3 నుంచి 5 అగ్ని ప్రమాద ఘటనలు వెలుగు చూస్తున్నాయి. గత నాలుగేళ్లలో ఏకంగా 66 మంది అగ్నికి ఆహుతయ్యారు. మరణాల సంఖ్య చూస్తే ఆదివారం(మే 18) పాతబస్తీ గుల్జార్‌హౌజ్‌లో జరిగిన ప్రమాదం చాలా పెద్దది. దీనిలో 17 ప్రాణాలు కోల్పోయారు. 2022, 2023 సంవత్సరాల్లోనూ భారీ అగ్ని ప్రమాదాలు జరిగాయి. ముఖ్యంగా వ్యాపార, నివాస సముదాయాలు కలిసి ఉన్న భవనాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మరణాల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఇంత జరుగుతున్నా జీహెచ్‌ఎంసీ, అగ్నిమాపకశాఖ, ఈవీడీఎం, హైడ్రా, పోలీసులు నిర్లక్ష్యం వీడట్లేదు. నగరంలోని ప్రముఖ వ్యాపార కేంద్రాలలో వరుసగా ప్రమాదాలు జరుగుతుండటంతో ఆయా ప్రాంతాల్లో తగినట్టుగా నివారణ చర్యలు తీసుకోవట్లేదనే విమర్శలొస్తున్నాయి.

## గొడవలో మహిళ వేలు కొరికిన వ్యక్తి, విరిగి పడిపోవడంతో అంతా షాక్

- చిట్టీ డబ్బుల వ్యవహారంలో పెరిగిన మాటామాట
- మహిళ చూపుడు వేలును కొరికేసిన వ్యక్తి
- ఆసుపత్రికి తీసుకెళ్తే అతికించలేమన్న వైద్యులు

**మధురానగర్ మే 19(ప్రజాక్షేత్రం):** చిన్న చిట్టీ డబ్బుల వ్యవహారం పెద్ద విషాదానికి దారి తీసింది. మాటామాట పెరిగి ఒకరు చూపుడు వేలిని పోగొట్టుకోగా, నిందితుడు జైలు పాలు కావాల్సి వచ్చిన ఘటన మధురానగర్ లో చోటుచేసుకుంది. జవహర్‌నగర్‌కు చెందిన మమత అనే మహిళ అక్కడి ఓ అపార్ట్‌మెంట్ పెంట్‌హౌస్‌లో అద్దెకు నివసిస్తోంది. ఆ ఇంటి యజమానురాలు సుజిత చిట్టీలు వేస్తుండేంది. ఆమె దగ్గర మమత కూడా చిట్టీలు వేసేది. ఈ వ్యవహారంలో ఇంటి యజమానురాలు మమతకు రూ.30 వేలు చెల్లించాల్సి ఉంది. ఇటీవల మమత ఇల్లు ఖాళీ చేసి తన స్నేహితురాలు సుప్రియకి అప్పగించింది. అయితే సుప్రియ ఇంటిని ఖాళీ చేయడంతో సుజితకు అద్దె విషయంలో ఇబ్బందులు తలెత్తాయి. ఇదిలా ఉండగా తమకు చెల్లించాల్సిన డబ్బుల విషయమై మమత ఆమె భర్త హేమంత్ సుజిత దగ్గరకు వెళ్లి డబ్బులు అడిగారు. వారి మధ్య మాటామాట పెరిగింది.

**కోపంతో వేలు కొరికేసి**

వాళ్ల మధ్యలో సుజిత తల్లి లత జోక్యం చేసుకోగా హేమంత్ కోపంలో ఆమె కుడిచేతి చూపుడు వేలిని గట్టిగా కొరికేశాడు. వేలు ఊడి కింద పడిపోయింది. తక్షణమే ఆమెను ఆసుపత్రికి తరలించారు. కానీ వైద్యులు ఆ వేలు తిరిగి అతికించలేమని చెప్పారు. దీంతో బాధితురాలు తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యారు. సుజిత ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు హేమంత్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



## మందుబాబులకు జరిమానా

**సిద్దిపేట అర్బన్ మే 19(ప్రజాక్షేత్రం):** సిద్దిపేట ట్రాఫిక్ పోలీసుల వాహన తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 25 మందికి రూ. 53,500/ వేల రూపాయల జరిమానాను సిద్దిపేట సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆశ కాంతా రావు విధించారని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సిబ్బందితో గత కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, చౌరస్తాలలో, రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ చేయగా, 25 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా విచారణ చేసి 25 మందికి రూ. 53,500/వేల రూపాయల జరిమాన విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ ప్రవీణ్ కుమార్, మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడవదని, మరియు రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించే వాహనాలు నడపాలని, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

# ట్రాఫిక్ రూల్స్ బ్రేక్ చేస్తే ఈజీగా దొరికేస్తారు!

- ఈ - ఎన్‌ఫోర్స్‌మెంట్ పరికరాలు వస్తున్నాయ్
- ట్రాఫిక్ ఉల్లంఘనల నియంత్రణపై రవాణాశాఖ దృష్టి
- 'రియల్ టైం'లో నమోదుకు 375 ట్యాబ్‌లు కొనుగోలు చేయనున్న ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్

**తెలంగాణ బ్యూరో మే 19(ప్రజాక్షేత్రం):** రహదారులపై నిబంధనలు ఉల్లంఘించే వాహనదారుల కట్టడికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించేందుకు రాష్ట్ర రవాణాశాఖ సిద్ధమవుతోంది. కొత్తగా నియామకమైన 113 మంది ఏఎంవీఐ(అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల)లతో రాష్ట్రస్థాయిలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయనుంది. వీరందరినీ క్షేత్రస్థాయి విధుల్లో వాహనాల తనిఖీలకు ఉపయోగించాలని రవాణాశాఖ నిర్ణయించింది. అదేసమయంలో వాహన తనిఖీల్లో టెక్నాలజీ వాడకానికి ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈఎన్‌ఫోర్స్‌మెంట్) పరికరాల వాడకానికి ప్రణాళికలను రూపొందించి ప్రభుత్వానికి పంపించింది. ఇందుకోసం మొత్తంగా రూ.8.4 కోట్ల నిధులు కావాలని ప్రతిపాదించింది.

**'రియల్ టైం'లో నమోదుకు 375 ట్యాబ్‌లు**

రాష్ట్రంలో జరుగుతున్న అధికశాతం రోడ్డు ప్రమాదాలకు అతివేగంగా డ్రైవ్ చేయడమనేది ఓ ప్రధాన కారణం. వేగపరిమితుల్ని(స్పీడ్ లిమిట్) నిర్దేశించినప్పటికీ చాలామంది వాహనచోదకులు వాటిని పాటించట్లేదు. గత ఏడాది ఏకంగా 11.31 లక్షల అధిక వేగం(ఓవర్ స్పీడ్) కేసులు నమోదయ్యాయి. 25,971 మంది అన్నిరకాల రోడ్డు ప్రమాదాల్లో బాధితులు అయ్యారు. అధిక వేగంతో వెళ్లే వారిపై కేసుల నమోదు చేసేందుకు రవాణాశాఖ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా 40 స్పీడ్ గన్‌లను కొనుగోలు చేయాలని రవాణా శాఖ నిర్ణయించింది.

**రియల్ టైంలో ట్యాబ్‌లో నమోదు**

ఇందుకోసం ఒక్కోదానికి రూ.7 లక్షల చొప్పున రూ.2.8 కోట్లు అవసరం అవుతాయి. ట్రాన్స్‌ఫోర్ట్ డిపార్ట్‌మెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు వాహనాలను తనిఖీ చేసినప్పుడు వెహికిల్ చెక్ రిపోర్ట్(వీసీఆర్)ను మాన్యువల్‌గానే ఎంటర్ చేస్తున్నారు. ఆ తర్వాత ఈ వివరాల నమోదులో జాప్యం కారణంగా ఎక్కువ వాహనాలను చెక్ చేయలేకపోతున్నారు. దీంతో ట్యాబ్(హ్యాండ్‌హెల్డ్ డివైజ్)లు కొనుగోలు చేసేందుకు రవాణాశాఖ సిద్ధం అవుతోంది. వీటితో వాహనచోదకుల ట్రాఫిక్ ఉల్లంఘనలను రియల్ టైంలో ట్యాబ్‌లో ఎంటర్ చేయవచ్చు. వాహనదారులు జరిమానాల్ని, పాత బకాయిల్ని వెంటనే చెల్లించేందుకు వెసులుబాటు కలుగుతుంది. ఒక్కో ట్యాబ్ ధర 1.5 లక్షలు. 375 ట్యాబ్‌ల కొనుగోలుకు రూ.5.6 కోట్ల ఖర్చు కానుంది. కొత్తగా నియామకమైన 113 మంది ఏఎంవీఐలను క్షేత్రస్థాయి విధుల్లో వాహనాల తనిఖీలకు ఉపయోగించాలని రవాణాశాఖ నిర్ణయించింది.





## పాత్రికేయులంటే అంత చులకన చంద్రబాబు

- జర్నలిస్టు సాధిక్ కు వాసుపల్లి రూ.5000 ఆర్థిక సాయం
- పాత్రికేయుల హామీలు పాతరేసిన కూటమి ప్రభుత్వం
- పదవుల వ్యామోహంతో కోల్డ్ వార్ లో కూటమి నేతలు
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

**విశాఖపట్నం, మే 19( ప్రజాక్షేత్రం ):** అధికార దాహంతో కొట్టుమిట్టాడుతున్న కూటమి ప్రభుత్వం జర్నలిస్టులు అంటే అంత చులకన భావన తగదని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ దుయ్యబట్టారు. ఆసీలమెట్ట కార్యాలయంలో సోమవారం ఉదయం పాత్రికేయుడు సాదిక్ భార్య ఎండి రషీదా బేగం మెడికల్ ఖర్చులకు రూ. 5000ల నగదును వాసుపల్లి గణేష్ కుమార్ అందజేశారు. గైనిక్ సమస్యతో బాధపడుతున్న ఆమెకు మెడికల్ ఖర్చులకు అందజేసి పాత్రికేయుడికి అండగా నిలిచారు ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి అక్రిడేషన్ల మంజూరు చేసి, ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా చేశారన్నారు.ఎన్నికల కోడ్ నేపద్యంలో ఆగిపోయిన జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు తిరిగి వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో వచ్చిన వెంటనే మళ్లీ న్యాయం చేస్తామని వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. చంద్రబాబు గతంలో పాత్రికేయులను మోసం చేసిన మాదిరిగా నేడు అధికారంలో కూడా అదే పందాలో చులకనగా చూస్తున్నారని ఆరోపించారు.అధికారం చేపట్టి దాదాపు ఏడాది అవుతున్నప్పటికీ కనీసం జర్నలిస్టులకు అక్రిడేషన్లు కూడా ఇవ్వలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఏ వర్గానికి కూడా న్యాయం చేయకపోగా, జీవీఎంసీ మేయర్ డిప్యూటీ మేయర్ పదవుల కోసం తెలుగు తమ్ముళ్లు,జనసేన నేతలు మధ్య కోల్డ్ వార్ నడుస్తోందన్నారు.పదవుల కోసమే తప్ప ప్రజల సమస్యలు పట్టని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు తీరు మార్చుకోకపోతే ప్రజలు త్వరలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సుపరిపాలన అంటే జగన్మోహన్ రెడ్డిని చూసి నేర్చుకోవాలని వాసుపల్లి హితవు పలికారు.ఇప్పటికైనా జర్నలిస్టులకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసి అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు తో పాటు వారి పిల్లలకు ఉచిత కార్పొరేట్ విద్య, లైఫ్ ఇన్సూరెన్సులు, సీనియర్ పాత్రికేయులకు పెన్షన్లు, అందజేసి అండగా నిలవాలని వాసుపల్లి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో 27వ వార్డు వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు సర్వేశ్వర్ రెడ్డి,చింతకాయల వాసు,చేపల రాజు తదితరులు పాల్గొన్నారు.



## పల్లా శ్రీనివాస్ పై అన్ని పార్టీల మద్దతుతో న్యాయ పోరాటం కొనసాగిస్తా...

- ఎమ్మెల్యే పదవి నుంచి భర్తరఫ్ చేయాలి
- ఇది నా వ్యక్తిగత పోరాటం... టిడిపి పార్టీకి సంబంధం లేదు
- ఈ పోరాటానికి అన్ని పార్టీల మద్దతు కోరుతున్నాను.
- తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్

**విశాఖపట్నం,మే 19( ప్రజాక్షేత్రం):** టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ పై తాను వ్యక్తిగతంగా న్యాయపోరాటం చేస్తున్నాను అని,ఈ పోరాటానికి కాంగ్రెస్, వైసిపి,సిపిఐ,సిపిఎం,లోక్‌సత్తా మొదలైన పార్టీల మద్దతు కోరుతున్నట్టు తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ తెలిపారు.న్యూ కాలనీలోని సింకా గ్రాండ్ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈరోజు కాంగ్రెస్ పార్టీ మద్దతు కోరినట్లు చెప్పారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నిస్తే చంపేస్తామని గాజువాక టిడిపి నాయకులు బెదిరిస్తున్నారు. ఆయన మనుషులు నన్ను హత్య చేసేందుకు ప్రయత్నించారని,100 మంది ఒకేసారి దాడి చేసి చంపే ప్రయత్నం చేశారన్నారు. గాజువాకలో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయలేదన్నారు. దీనిపై పోలీస్ కమిషనర్ను కలిశానని, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై నాకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఆయన దీనిపై దృష్టి సారించి తనపై జరిగిన దాడిని ఖండించాలని, హోటల్ లో జరిగిన దాడి సంఘటన వీడియో తెప్పించుకుని చూడాలని కోరారు. ఈ దాడి నా ఒక్కడి మీద జరిగింది కాదని, తెలుగు ప్రజలపై జరిగిన దాడిగా చూడాలన్నారు. పల్లా శ్రీనివాసరావు ఒక మాఫియా లా తయారయ్యాడని చెప్పారు. అతనిపై సిబిఐ, కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేశానన్నారు. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పల్లా శ్రీనివాస్ సిబిఐ దర్యాప్తు కోరుకోవాలన్నారు. నేను ఎవరికీ భయపడనని అన్నారు, చివరిదాకా పోరాటం చేస్తానన్నారు. ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వం అని భావించామని అయితే టిడిపి నాయకులు జగన్ కంటే అరాచకంగా తయారయ్యారన్నారు. శాంతియుతమైన విశాఖలో పల్లా శ్రీనివాసు అండ్ గ్యాంగ్, పల్లా కార్తీక్ పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, వెనక్కుండి నడిపిస్తారని అనడం సరికాదన్నారు. పల్లా శ్రీనివాస్ దగ్గర ఉన్న మురళి అతని వ్యవహారాలన్నీ చూస్తారని, సెటిల్మెంట్లు, కలెక్షన్ అన్ని అతనే చేస్తారన్నారు. పల్లా శ్రీనివాసపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్న అన్నారు. ఎమ్మెల్యే పదవి నుంచి భర్తరఫ్ చేయాలని ముఖ్యమంత్రిని కోరుతున్నాం అన్నారు. అన్ని పార్టీల మద్దతుతో న్యాయ పోరాటం కొనసాగిస్తానన్నారు. రక్షణ కోసం తాను పోలీస్ కమిషనర్ ని గన్ లైసెన్స్ కూడా అడుగుతానని చెప్పారు.



## మరకత శివాలయంలో ఆదిలాబాద్ జిల్లా జాగృతి అధ్యక్షుడు ప్రత్యేక పూజలు

**శంకర్‌పల్లి మే 19(ప్రజాక్షేత్రం):**

శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో వెలసిన 11వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో సోమవారం ఆదిలాబాద్ జిల్లా జాగృతి అధ్యక్షుడు శ్రీనివాస్ కుటుంబ సభ్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు సాయి శివ కుటుంబ సభ్యులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి జాగృతి అధ్యక్షుడికి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, క్యాషియర్ గోపాల్ పాల్గొన్నారు.



## మర్చిపోయాడా.. వదిలించుకున్నాడా.. భర్త చేసిన పని చూస్తే నవ్వాగదు

**వెబ్‌డెస్క్ (ప్రజాక్షేత్రం):** సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రతిరోజు కొన్ని వందల వీడియోలు మన కళ్ల ముందుకు వస్తున్నాయి. వాటిల్లో కొన్ని ఫన్నీగా, మరికొన్ని ఆసక్తికరంగా ఉంటూ అందర్నీ ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం అలాంటిదే ఓ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఆ వీడియోలో ఓ భర్త చేసిన పని సోషల్ మీడియా జనాలను విపరీతంగా నవ్విస్తోంది. అనే ట్విటర్ హ్యాండిల్‌లో ఆ వీడియో షేర్ అయింది. వైరల్ అవుతున్న ఆ వీడియోలో ఓ వ్యక్తి తన కుటుంబంతో కలిసి బైక్ మీద వెళ్తున్నాడు. అతడు బైక్ నడుపుతుండగా అతడి కొడుకు, భార్య వెనుక కూర్చున్నాడు. బిజీగా ఉన్న రోడ్డుపై అతడు వేగంగా వెళ్తున్నాడు. ఆ సమయంలో అతడికి ఎదురుగా ఓ ట్రక్కు వచ్చింది. దాంతో అతడి బైక్ కొద్దిగా వంగింది. ఆ సమయంలో బైక్ వెనుక కూర్చున్న మహిళ కిందకు దిగిపోయింది. భార్య దిగిపోయినట్టు పట్టించుకోని ఆ వ్యక్తి బైక్ నడుపుకుంటూ ముందుకు వెళ్లిపోయాడు. ఆ ఘటనను అదే రోడ్డులో వెళ్తున్న ఓ వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

## తెలంగాణలో భారీగా డీఎస్పీలు బదిలీ

**హైదరాబాద్ మే 19(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ పోలీస్‌శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో భారీగా డీఎస్పీలను బదిలీ చేసింది. మొత్తం 77 మందిని బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల డీఎస్పీగా వెంకటస్వామి, బాలానగర్ ఏసీపీగా నరేశ్ రెడ్డి, శంషాబాద్ ఏసీపీగా శ్రీకాంత్ గౌడ్, మాదాపూర్ ఏసీపీగా సీహెచ్ శ్రీధర్, చిక్కడపల్లి ఏసీపీగా శ్రీకాంత్, మేడ్చల్ ఏసీపీగా శంకర్ రెడ్డి సహా మొత్తం 77మందిని డీజీపీ బదిలీ చేశారు.






## సుందరయ్య స్ఫూర్తితోసిపిఎం పార్టీ కార్యకర్తలు పని చేయాలి


**సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కె. రాజయ్య**

**కొండాపూర్ మే 19 (ప్రజాక్షేత్రం):** సుందరయ్య వర్ధంతి సందర్భంగా సోమవారం కొండాపూర్ సిపిఎం పార్టీ శాఖ ఆధ్వర్యంలో సుందరయ్యకు నివాళులర్పించారు... ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కె రాజయ్య మాట్లాడుతూపుచ్చలపల్లి సుందరయ్య 1913 మే 1న జన్మించి నెల్లూరు జిల్లా అలగానిపాడు లో భూస్వామ్య కుటుంబంలో జన్మించి ఆరేళ్ల వయసులో తండ్రిని కోల్పోయాడు గ్రామీణ జీవనంలో రైతులు వ్యవసాయ కూలీలు భూస్వాములు దోపిడి వెట్టి చాకిరి దౌర్జన్యాన్నిసుందరయ్య దగ్గర ఉండి రైతులు కూలీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పసిగట్టి1930 లో17 ఏళ్లవయసులోనే జైలు శిక్ష అనుభవించాడు అక్కడ కమ్యూనిస్టు భావజాలంతో పరిచయం ఏర్పడిందిజైలు నుండి విడుదలైన తర్వాత స్వాగ్రామంలో వ్యవసాయ కార్మికులను సంఘటితం చేసి భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారుఆ కాలంలోనే భూస్వాములకు వ్యతిరేకంగా గ్రామాలలో పోరాటాలు చేసి రైతులకు వ్యవసాయ కూలీలకు అండగా నిలబడి భూస్వాముల దోపిడీలను అదరగొట్టినటువంటి సుందరయ్య గారు ఆ కాలంలోనే ప్రజల పక్షాన పార్లమెంటు సభ్యునిగా పార్లమెంటు సమావేశాలకు మామూలు వ్యక్తి లాగా సైకిల్ పైన పాదయాత్ర పైన పార్లమెంటుకు వెళ్లేవాడన్నారు.ఇప్పుడున్నటువంటి రోజులలో ఒక వార్డ్ మెంబర్ ఒకటి ఎంపీటీసీ సర్పంచులు అయితే లెక్క లేదని ఆస్తులు సంప్రదించుకున్నటువంటి ఈరోజుల్లో కానీ సుందరయ్య సైకిల్ పైన గ్రామ గ్రామానికి వెళ్లి ఇబ్బంది పడుతున్నటువంటి రైతులలో చైతన్యం చేసి పోరాటాల వైపు తిప్పినటువంటి వ్యక్తి సుందరయ్య ఆ సుందరయ్యను ఆదర్శంగా తీసుకొని సిపిఎం పార్టీ నిరంతరము సుందరయ్య స్ఫూర్తితో నడవాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు ప్రవీణ్,అమృతమ్మ,అంజయ్య,పార్టీ సభ్యులు వెంకన్న,వెంకటేశం,సుదర్శన్,మధు,రత్నయ్య,సుధాకర్,సంజీవులు,రాజు,కృష్ణ,అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'రాజీవ్ యువ వికాసం'పై మరో అప్‌డేట్.. కలెక్టర్లకు సర్కార్ కీలక ఆదేశాలు


**తెలంగాణ బ్యూరో 19(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'రాజీవ్‌యువ వికాసం' పథకానికి ఊహించని రెస్పాన్స్ వస్తుంది. ఇప్పటికే ఈ స్కీమ్‌కు రాష్ట్ర వ్యాప్తంగా లక్షల్లో దరఖాస్తులు అందినట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే పథకానికి సంబంధించి ప్రభుత్వం మరో బిగ్ అప్‌డేట్ ఇచ్చింది. ఇటీవలే ఆమోదించిన ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని రాజీవ్ యువ వికాసం పథకంలో అమలు చేయబోతున్నట్లుగా ప్రకటించింది. ఈ మేరకు అందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇక ఈ పథకానికి గాను ఎస్సీ సామజికవర్గం నుంచి మొత్తం 44,800 దరఖాస్తులు అందాయి. దీంతో తాజాగా ఎస్సీ వర్గీకరణ చట్టం ప్రకారం మూడు ఉపకులాలకు 1, 9, 5 శాతంతో రిజర్వేషన్లను అమలు చేయనున్నారు. అయితే, ఎస్సీ గ్రూప్B నుంచి అత్యధిక దరఖాస్తులు అందినట్లుగా అధికారులు పేర్కొన్నారు. త్వరలోనే దరఖాస్తుల వారీగా లబ్ధిదారులకు కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేయనున్నారు. అనంతరం జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేళ యూనిట్ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఇప్పటికే రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.6 వేల కోట్లు విడుదల చేయబోతున్నట్లుగా ప్రకటించిన విషయం విదితమే.




## పిన్నీసు మింగి చిన్నారి మృతి

**వర్గల్ మే 19(ప్రజాక్షేత్రం):** ఆట వస్తువులోని పిన్నీసు మింగడంతో ఓ చిన్నారి మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని నాచారం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హర్యానాకు చెందిన షోయబ్ ఖాన్ నాచారంలో జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 14 నెలల వయసు గల షోయబ్‌ఖాన్ కుమార్తె ఆటవస్తువులోని పిన్నీసు మింగింది. వెంటనే పాపను ఆర్వీయం ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిలోఫర్ హాస్పిటల్‌కి తరలించారు. నిలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. చిన్నారి తండ్రి షోయబ్ ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు గౌరారం ప్రొబేషనరీ ఎస్సై కీర్తి రాజు తెలిపారు.





## క్రీడాకారులకు పోషకాలతో కూడిన డైట్ పంపిణీ చేసిన తెదేపా నాయకులు

**క్రీడలు ఉత్తేజాన్ని పెంచుతాయి,ఒత్తిడిని తగ్గిస్తాయి- మజ్జి సోమేష్**

**శ్రీహరిపురం,మే 19(ప్రజాక్షేత్రం):** పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం జీవీఎంసీ 60 వార్డు శ్రీహరిపురం గొల్లల పాలెం క్రీడ మైదానం లో వేసవి శిబిరంలో భాగంగా మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ నిర్వహిస్తున్న క్రీడల్లో స్థానిక బాల బాలికలు పెద్ద ఎత్తున పాల్గొని శిక్షణ పొందుతున్నారు.ఈ క్రమంలో సోమవారం 61 వ వార్డు తెదేపా పార్టీ అధ్యక్షులు, ప్రముఖ కాంట్రాక్టర్ మజ్జి సోమేష్ ఆధ్వర్యంలో క్రీడాకారులను ప్రోత్సహిస్తూ తన సొంత నిధులతో క్రీడలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పోషకాలతో కూడిన డైట్ అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కావడంతో క్రీడాకారులు అలిసిపోకుండా ఉండేందుకు తమ వంతు ఉడతా భక్తి సాయమని ఆయన అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని,ఉన్నత విద్యను అభ్యసించి క్రీడల్లో కూడా రాణిస్తే క్రీడల ద్వారా కూడా ఉపాధి పొందే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబు కూడా ఒక క్రీడాకారుడు అని గుర్తు చేశారు.క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఎమ్మెల్యే ప్రోత్సాహం కూడా ఉంటుందని హేతువు పలికారు.ఇదివరకే ఎంతోమంది స్పోర్ట్స్ కోటలో రాణిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో బోగవిల్లి ఆనంద్,బాక్సింగ్ క్లబ్ కమిటీ అధ్యక్షులు మజ్జి రమేష్,ప్రసాద్, పాత్రుడు,సెక్రటరీ షేక్ అలీ, రైల్వే కోచ్ కటారి సునీల్,ప్రభ తదితరులు పాల్గొన్నారు.

## దళితుడు అయినందుకేనా సీజేఐకి ప్రొటోకాల్ లేదు?

- ముంబై వెళ్లిన సీజేఐ గవాయికి ప్రొటోకాల్ ఇవ్వని మహారాష్ట్ర ప్రభుత్వం
- ఆయన దళితుడు పైగా బుద్ధిస్టు కాబట్టే ఉద్దేశపూర్వక వివక్ష
- ఈ ఘటనపై భగ్గుమంటున్న ప్రజాస్వామ్య-రాజ్యాంగవాదులు



**నేషనల్ బ్యూరో మే 19(ప్రజాక్షేత్రం):**భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయి మహారాష్ట్రలో తన తొలి అధికారిక సందర్శన సందర్భంగా రాష్ట్ర అధికారులు ప్రొటోకాల్‌ను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించి కుల వివక్ష అనే దుర్మార్గపు ముఖాన్ని మరోసారి బయటపెట్టారు. దళిత సామాజిక నేపథ్యం నుంచి వచ్చిన ఆయన, అంబేద్కర్ స్ఫూర్తితో బౌద్ధమతాన్ని స్వీకరించారు. 2025 మే 14న దేశ 52వ సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ముంబైలో జరిగిన బార్ కౌన్సిల్ ఆఫ్ మహారాష్ట్ర అండ్ గోవా ఫెలిసిటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే, ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ముంబై పోలీస్ కమిషనర్ వంటి ఉన్నతాధికారులు హాజరు కాకపోవడం దేశ న్యాయ వ్యవస్థ అత్యున్నత స్థానంలో ఉన్న వ్యక్తి పట్ల జరిగిన అవమానకర, కులాధారిత చర్యగా నిలిచింది.

**కుల వివక్ష దుర్మార్గపు ముఖం**

జస్టిస్ గవాయి దళిత సమాజానికి చెందిన వ్యక్తిగా భారత న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థానానికి చేరుకోవడం సామాజిక న్యాయ పోరాటంలో ఒక మైలురాయి. అయినప్పటికీ, ఈ ఘటన మహారాష్ట్ర ప్రభుత్వం కుల దురహంకారంతో వ్యవహరించినట్లు స్పష్టం చేస్తోంది. సీజేఐ స్థానం రాజ్యాంగబద్ధమైన గౌరవాన్ని కలిగి ఉంది. ఈ స్థానంలో ఉన్న వ్యక్తి పట్ల ప్రొటోకాల్‌ను అలక్ష్యం చేయడం కేవలం నిర్లక్ష్యం కాదు, లోతుగా పాతుకుపోయిన సామాజిక పక్షపాతాల దుష్ప్రభావం. జస్టిస్ గవాయి దీనిపై కాస్త ఘాటుగానే స్పందించారు. మహారాష్ట్ర ప్రభుత్వ తప్పిదాన్ని ఎండగట్టారు. రాజ్యాంగం అనేది ఉందని, దాన్ని గుర్తెరిగి నడుచుకోవాలని చురకలు అంటించారు.

**మహారాష్ట్ర ప్రభుత్వ నీచమైన వైఖరి**

మహారాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనపై సమర్థవంతమైన వివరణ ఇవ్వకపోవడం, బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం వివాదాన్ని మరింత రాజేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఈ నిర్లక్ష్యం దళిత సమాజం పట్ల ఉన్న దాగుడుమూతల వివక్షను బహిర్గతం చేస్తోంది. "సీజేఐ స్థానాన్ని కూడా గౌరవించని ఈ కుల దురహంకారం రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాసిన చర్య. ఇది కేవలం ఒక వ్యక్తిపై జరిగిన అవమానం కాదు, దళిత సమాజం మొత్తం పట్ల చూపిన అగౌరవం," అని సామాజిక న్యాయ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**సమాజంలో కొనసాగుతున్న కుల వివక్ష**

ఈ ఘటన కేవలం ఒక అధికారిక కార్యక్రమంలో జరిగిన పొరపాటు కాదు. ఇది భారత సమాజంలో లోతుగా పాతుకుపోయిన కుల వివక్ష తాలూఖు ఒక ఉదాహరణ మాత్రమే. ఒకవైపు రాజ్యాంగంలో సమానత్వం, సామాజిక న్యాయం గురించి బలమైన అధికరణలు ఉన్నప్పటికీ, మరోవైపు అత్యున్నత స్థాయిలోనే కుల దురహంకారం బహిర్గతమవుతుండటం దేశ ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు. దళిత సమాజం నుంచి ఉన్నత స్థానాలకు చేరిన వ్యక్తులు కూడా ఈ వివక్ష నుంచి తప్పించుకోలేకపోతున్నారంటే, సామాన్య దళితుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో ఊహించవచ్చు. ఈ ఘటనను దళిత సమాజం పట్ల సమాజంలో కొనసాగుతున్న వివక్షకు అద్దం పట్టిన సంఘటనగా రాజ్యాంగవాదులు, ప్రజాస్వామ్యవాదులు అభివర్ణిస్తున్నారు. "కులం ఆధారంగా వివక్ష చూపడం ఒక సామాజిక వ్యాధి. ఈ వ్యాధిని నిర్మూలించడానికి కఠిన చట్టాలతో పాటు, సమాజంలో విస్తృతమైన చైతన్యం అవసరం" అని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనను ఒక అవకాశంగా తీసుకుని, కుల వివక్షను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయి పట్ల మహారాష్ట్ర ప్రభుత్వం చూపిన అవమానకర వైఖరి కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు. ఇది రాజ్యాంగ స్ఫూర్తిని, సామాజిక న్యాయాన్ని, దళిత సమాజ ఆత్మగౌరవాన్ని ధిక్కరించిన నీచమైన చర్య. ఈ ఘటన భారత సమాజంలో కుల వివక్ష ఇంకా ఎంత లోతుగా పాతుకుపోయి ఉందో తెలియజేస్తోంది. ఈ దుర్మార్గాన్ని సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వాలు, సమాజం కలిసి పనిచేయాల్సిన అవసరం ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోంది. లేనిపక్షంలో, రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వం కేవలం ఒక భ్రమగానే మిగిలిపోతుంది.




## అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు

- ప్రజలు,అధికారుల భాగస్వామ్యంతో ఈ నెల 21న బీచ్ రోడ్లో ప్రాథమిక వేడుకలు
- వీసీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించిన కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాఖపట్టణం,మే 19(ప్రజాక్షేత్రం):జూన్ 21న జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని,ఇప్పటికే అనువైన స్థలాలను గుర్తించామని,ఇతర ప్రక్రియలు మొదలు పెట్టామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు.వేడుకల నిర్వహణపై రాష్ట్ర సచివాలయం నుంచి సోమవారం సాయంత్రం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.దీనిలో భాగంగా జిల్లా కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్ తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ జిల్లాలో చేపడుతున్న చర్యలను వివరించారు.జిల్లాలో ఇప్పటికే ప్రాథమికంగా అందరి అధికారులతో సన్నద్ధత సమావేశం నిర్వహించామని, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో 2.50 లక్షల మందిని భాగస్వామ్యం చేసేందుకు కసరత్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే అనువైన స్థలాలను గుర్తించామని,శిక్షకుల ద్వారా శిక్షణలు ప్రారంభించామని చెప్పారు. దీనిలో భాగంగా మాసోత్సవాలను నిర్వహించేందుకు ప్రణాళికలు రచించినట్లు వెల్లడించారు.ఈ నెల 21న విశాఖ బీచ్ రోడ్లో 500 మందితో ప్రాథమిక వేడుకలను ప్రారంభించి ఈ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించేందుకు శ్రీకారం చుడతామని తెలిపారు.ఆ రోజు నుంచి మండల,గ్రామ స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు, శిక్షణలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. జూన్ 21న ప్రధాన కార్యక్రమ నిర్వహణకు సంబంధించి విధివిధానాలు ఖరారు అయిన వెంటనే పూర్తిస్థాయి చర్యలు చేపడతామని సీఎస్ కు వివరించారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి అక్కడ నుంచి విజయనగరం జిల్లా మీదుగా శ్రీకాకుళం వరకు సుమారు 5 లక్షల మందిని భాగస్వామ్యం చేస్తూ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉన్నామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారుకలెక్టరేట్ వీసీ హాలు నుంచి వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ

**యం ఈవో యం. మాధవరెడ్డి**



**గజ్వెల్ టౌన్ మే, 19(ప్రజాక్షేత్రం ):** జగదేవపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు మే 20 నుండి 24వరకు వృత్యంతర శిక్షణ జగదేవపూర్ బాలికల పాఠశాల యందు ఉంటుందని మండల విద్యాధికారి యం మాధవరెడ్డి మండల వనరుల కేంద్రం లో ఏర్పాటు చేసిన యం ఆర్ పి ల సన్నాహక సమావేశంలో తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిక్షణ లో ఈ విద్యా సంవత్సరం పాఠశాల కార్యక్రమాలు ఎఫ్ ఎల్ ఎన్ అన్ని పాఠ్య పుస్తకాల పాఠ్యంశ నిర్మాణ క్రమం పై పూర్తి అవగాహన కల్పిస్తూ, కృత్యాధారణ బోధన పై పూర్తి అవగాహనా కల్పిస్తూ ఉపాధ్యాయుల్లో ఉన్న బెస్ట్ ప్రాక్టీసెస్ ను ప్రదర్శిస్తారని దీనికి ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయులు ఎస్ జి టీ లందరు తప్పకుండ హాజరు కావాలని చెప్పారు. ఈ కార్యక్రమం లో యం ఆర్ పి లు శంకర్ భాస్కర్ శివప్రసాద్ సి ఆర్ పి లు దయానంద్, రమణ అరుంధతి తదితరులు పాల్గొన్నారు.





# భూమిలో కరిగిపోయే సంచులను ప్రోత్సహించాలి

- బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారేత్ విన్ ఓవెన్
- రమణి ఇండస్ట్రీస్ ఉత్పత్తులు అద్భుతం

**చౌటుప్పల్,మే 19(ప్రజాక్షేత్రం):**

దండు మల్కాపురం పర్యావరణాన్ని రక్షించేందుకు రమణి ఇండస్ట్రీస్ లో ఉత్పత్తి చేస్తున్న భూమిలో కరిగిపోయే సంచుల తయారీ ప్రశంసనీయమని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారేత్ విన్ ఓవెన్ అన్నారు. ఒకసారి వాడి పడవేసే ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా మట్టిలో కరిగిపోయే సంచులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరి పైన ఉందని తెలిపారు.యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం హరిత పారిశ్రామిక పార్కులోని రమణి బయో కాంపోస్టికా పరిశ్రమను ఆయన సోమవారం సందర్శించారు. డి ఆర్ డి ఓ శాస్త్రవేత్తలు అందించిన సాంకేతిక సహకారంతో రమణి, డాక్టర్ ప్రసాదులు నెలకొల్పిన రమణి ఇండస్ట్రీస్ లో బయో డిగ్రేడబుల్ సంచులను తయారు చేసే ప్రక్రియను ఆయన పరిశీలించారు.మొక్కజొన్న పొట్టుతో తయారయ్యే గ్రాన్యూల్స్ ను ఉపయోగించి వివిధ రకాల క్యారీ బ్యాగులను,రైతులు ఉపయోగించే మల్చింగ్ షీట్లను తయారు చేసే యంత్రాలను ,వాటి నుంచి తయారుచేసిన సంచులను,ఆ సంచులపై సంస్థల పేర్లను ముద్రించే పద్ధతిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. వ్యాపారం కోసం కాకుండా సమాజానికి పర్యావరణానికి తమ వంతుగా కృషి చేయాలని సంకల్పంతో ఈ పరిశ్రమను స్థాపించామని రమణి డాక్టర్ ప్రసాదులు బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ కు వివరించారు. ఈ సంచులను ఉపయోగించి భూమిలో ఎక్కడ పడవేసిన 90 రోజులలో అవి మట్టిలో భూమికి ఎరువుగా ఉపయోగపడతాయని వివరించారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో తాము స్వయం ఉపాధి పొందడంతో పాటు ఈ ప్రాంతంలోని కొంతమందికి పని కల్పించగలుగుతున్నామని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ కు వివరించారు. బయో డిగ్రేడబుల్ ఉత్పత్తులను ప్రోత్సహించి తమకు సహకారం అందించాలని కోరారు.

### పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

**బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారేత్ విన్ ఓవెన్**

రమణి ఇండస్ట్రీస్ లో తయారవుతున్న బయో డీ గ్రేడబుల్ సంచులను ప్రోత్సహించాల్సిన, ఎగుమతి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను విరివిగా వాడుకుని పడవేస్తే అవి భూమిలో కరగడానికి వందల సంవత్సరాలు పడుతుందని పర్యావరణానికి ఎంతో నష్టం జరుగుతుందని వివరించారు. వాటికి ప్రత్యామ్నాయంగా కొన్ని రోజుల్లోనే భూమిలో కరిగిపోయే ఇలాంటి బయో డి గ్రేడబుల్ బ్యాగులు ఉత్పత్తి, వినియోగం జరగాలన్నారు. సామాజిక సేవా దృక్పథంతో బయోడిగ్రేడబుల్ బ్యాగుల తయారీ పరిశ్రమను నెలకొల్పిన రమణి డాక్టర్ ప్రసాద్ లను ఆయన అభినందించారు. వీటి మార్కెటింగ్ కు ఎగుమతులకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. టిఫ్ కార్యాలయానికి వెళ్లి హరిత పారిశ్రామిక పార్కు విశేషాలను తెలుసుకున్నారు. టిఫ్ మేనేజర్ శ్రీకాంత్ హరిత పారిశ్రామిక పార్కు ప్రగతిని వివరించారు.




## ముక్కు, చెవులు కోసి మహిళ దారుణ హత్య.. కేసును చేధించిన పోలీసులు..

**మేడ్చల్ మే 19(ప్రజాక్షేత్రం):**మేడ్చల్ శివారు అత్వెల్లి గ్రామంలో ఒంటరి మహిళ హత్య కేసును ఛేదించారు పోలీసులు. చెవిదిద్దుల కోసమే ఓ యువకుడు కిరాతకానికి ఒడిగట్టినట్టు తేల్చారు.

**సగానికి పైగా కాలిన మహిళ మృతదేహం**

మూడు రోజుల క్రితం అత్వెల్లిలోని ఓ రేకుల షెడ్ నుంచి మంటలు రావడం గమనించిన స్థానికులు మేడ్చల్ పోలీసులకు సమాచారమిచ్చారు. స్పాట్‌కు చేరుకున్న పోలీసులు మంటలను ఆర్పేశారు. కానీ అప్పటికే మహిళ మృతదేహం సగానికి పైగా కాలిపోయింది. మృతురాలు వికారాబాద్‌కు చెందిన లక్ష్మీగా గుర్తించారు. లక్ష్మీ ఓ వైన్ షాప్‌లో రోజువారి కూలీగా పనిచేసేది. ఏం జరిగిందో తెలియదు.. సడెన్‌గా హత్యకు గురయింది.

**ఒంటిపై నగలను గమనించిన రాకేష్**

కూలి పనులు చేసే రాకేష్.. తల్లితో కలిసి దిల్‌షుఖ్‌నగర్‌లో ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలోనే కిష్టాపూర్‌లో మద్యం తాగుతున్న సమయంలో లక్ష్మీ కంటపడింది. ఒంటిపై నగలు ఉండటంతో ఎలాగైనా వాటిని కొట్టేయాలని ప్లానేశాడు. ఆమెకు బాగా మద్యం తాగించాడు. నిద్రలోకి జారుకుందని భావించి.. నగలు తీసుకునే ప్రయత్నం చేశాడు. అయితే లక్ష్మీ ప్రతిఘటించడంతో గొంతుకోశాడు. ముక్కు చెవి భాగాలను కత్తిరించి బంగారంతో ఉడాయించాడు. వెళ్తూ వెళ్తూ డెడ్‌బాడీకి నిప్పంటించాడు. మర్డర్ మిస్టరీని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ తిరగేసి నిందితుడ్ని అరెస్ట్ చేశారు. ఐదు గ్రాముల ముక్కుపుడకలు, 60గ్రాముల వెండి కడియాలు, బ్రాస్‌లెట్, ఉంగరంతో పాటు 3,500 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తుల్ని ఎవరూ నమ్మొద్దని.. అనుమానం వస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు పోలీసులు.




## "ఫిట్ ఇండియా కాంపైన్" భాగస్వామ్యంతో సైక్లోథాన్ మారథాన్

**విశాఖపట్నం,మే, 19(ప్రజాక్షేత్రం ):** వస్తువులు మరియు సేవల పన్ను (జి ఎస్ టి) శాఖ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని,జూలై 1, 2025న "జి ఎస్టీ: పన్నులను సరళీకరించడం; పౌరులను సాధికారపరచడం" అనే ఇతివృత్తంతో జి ఎస్ టి దినోత్సవాన్ని జరుపుకుంటారు. ముఖ్యమైన సందర్భానికి ముందుగా,విశాఖపట్నం జి ఎస్ టి మరియు సెంట్రల్ ఎక్సైజ్ కమిషనరేట్ "ఫిట్ ఇండియా కాంపైన్" భాగస్వామ్యంతో సైక్లోథాన్ మారథాన్ను నిర్వహించినది. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం, భారతదేశ ఆర్థిక అభివృద్ధిలో జి ఎస్ టి ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించడం.

సైకల్ మారథానన్ను వైజాగ్ జోన్ కస్టమ్స్, జి ఎస్ టి మరియు సెంట్రల్ ఎక్సైజ్ చీఫ్ కమిషనర్ సంజయ్ రాఠీ, IRS జెండా ఊపి ప్రారంభించారు. సైక్లోథాన్ సెంట్రల్ రెవెన్యూ క్వార్టర్స్, శాండ్ హిల్స్ నుండి RK బీచ్ రోడ్ మరియు పామ్ బీచ్ హోటల్ జంక్షన్లను కలుపుతూ దాదాపు 7 కిలోమీటర్ల దూరం ప్రయాణించి, సెంట్రల్ రెవెన్యూ క్వార్టర్స్ వద్ద ముగిసింది. ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంటల్ అధికారులు మరియు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కర్యక్రమం విశాఖపట్నం జి ఎస్ టి కమిషనరేట్ అధికారులు మరియు సిబ్బంది మద్దతుతో విజయవంతంగా నిర్వహించబడింది. వారు మారథాన్ మార్గంలో పాల్గొనే వారందరి భద్రత మరియు శ్రేయస్సుకై అన్ని విధములుగా సహకరించారు.సైకిల్ మారథాన్ రెండు విధములుగా ఉపయోగపడింది, ఫిట్ ఇండియా ప్రచారానికి అనుగుణంగా శారీరక దృఢత్వాన్ని ప్రోత్సహించడం మరియు దేశ నిర్మాణంలో జి ఎస్ టి పాత్ర గురించి పౌరులకు అవగాహన కల్పించడం. ప్రజలకు అవగాహన కల్పించడానికి సమాచార బ్యానర్లను ప్రముఖంగా ప్రదర్శించారు మరియు మొబైల్ పరికరాల ద్వారా వివరణాత్మక జి ఎస్ టి సమాచారాన్ని సులభంగా యాక్సెస్ చేయడానికి డిజిటల్ క్యు ఆర్ కోడ్ను ప్రదర్శించారు.జి ఎస్ టి అవగాహనకు సంబంధించిన వీడియోలను కూడా పెద్ద ఎల్ ఈ డి స్క్రీన్పై ప్రదర్శించారు. ఇటువంటి ప్రజా సహకార కార్యకలాపాలు మరియు జి ఎస్ టి మీద అవగాహన కల్పించడం ఆశాఖ యొక్క అంకితభావాన్ని తెలియజేస్తుంది.



## వరుపుల రాజా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్

- క్రీడలు మానసిక మరియు శారీరక ఆరోగ్యంతో పాటు, భవిష్యత్తుకు బంగారు బాట వేస్తాయి.
- ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ.

**ఏలేశ్వరం,మే 19 (ప్రజాక్షేత్రం):**ప్రత్తిపాడు నియోజకవర్గం,ఏలేశ్వరం జూనియర్ కళాశాల మైదానంలో దివంగత నేత స్వర్గీయ వరుపుల జోగిరాజు(రాజా) జ్ఞాపకార్థం కాలేజీ గ్రౌండ్ టీం,బొదిరెడ్డి గోపి యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరుంధత వరుపుల రాజా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ ఏలేశ్వరం మండలం టిడిపి నాయకులతో కలిసి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ, దివంగత నేత రాజా పేరు మీద ఈ టోర్నమెంట్ నిర్వహించడం, ఆయన జ్ఞాపకాలు గుర్తు చేయడం చాలా ఆనందదాయకంగా ఉందని ఆమె అన్నారు.రాజా క్రీడల్లో ఎక్కువగా పాల్గొనేవారని, అందులో క్రికెట్ అంటే ఎక్కువగా మక్కువ చూపించే వారని అన్నారు.అదేవిధంగా యువకులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని ఆమె కోరారు. క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని ఇస్తూనే, మన భవిష్యత్తు కు బంగారు బాట వేస్తాయని అన్నారు. ఈ టోర్నమెంట్లో గెలిచిన టీం లకు మొదటి బహుమతి రూ 50 వేలు( షీల్డ్),ద్వితీయ బహుమతి రూ 30 వేలు(షీల్డ్), తృతీయ బహుమతి రూ 15 వేలు(షీల్డ్).ప్రకటించిన కమిటీ. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బోదిరెడ్డి గోపి,మూది నారాయణ స్వామీ,ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మేడిశెట్టి సూర్యకిరణ్,జ్యోతుల పెదబాబు,ఎండగుండి నాగబాబు, అనంతరపు రాజు,వాగు రాజేష్, ఏలేశ్వరం ఎస్సై ఎన్ రామలింగేశ్వరరావు తదితర పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత.

**కొండాపూర్,మే 19 (ప్రజాక్షేత్రం):**ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మండల పరిధిలోని తోగర్పల్లి, హరిదాస్పూర్,గంగారం, అనంతసాగర్,గొల్లపల్లి గ్రామాల్లో సోమవారం సంగారెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు,నరసింహారెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆదేశాల మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పేదోడికి గొప్ప వరం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో హరిదాస్పూర్ మాజీ ఎంపిటిసి లక్ష్మీ కిషన్ నాయక్,మండల జనరల్ సెక్రెటరీ గౌడిచెర్ల నర్సిములు, గంగారం మాజీ ఉపసర్పంచ్ నర్సింలు,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్,యూత్ కాంగ్రెస్ నాయకులు నగేష్ నాయక్ లు కలిసి సి.ఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు.





## ఆందోల్‌లో వైభవంగా రంగనాథుడి రథోత్సవం

**ఆందోల్ మే 19(ప్రజాక్షేత్రం):** ఆందోల్ లో ప్రసిద్ధిగాంచిన శ్రీ భూ నీలా సమేత రంగనాథ స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం అంగరంగ వైభవంగా రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకలకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ. దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథులుగా హాజరు కాగా, వీరిని ఆలయ ప్రధాన అర్చకులు, సభ్యులు పూర్ణ కుంభం తో ఘన స్వాగతం పలికారు. ముందుగా శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రథం ముందు పటం వేసి, అన్నాన్ని రథిగా పోసి, స్పీకర్ ప్రసాద్ రావు, మంత్రి దామోదర్ లు రథానికి పూజలు చేసి, తాళ్లతో రథాన్ని లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. రంగురంగుల డిజిటల్ ఎల్ఈడీ విద్యుత్ దీపాలతో అమర్చిన గొడుగుల లైటింగ్ వెలుగుతో రథం ముందుకు కదిలింది. ఆలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం జాతీయ రహదారి, అంబేద్కర్ చౌరస్తా, పోచమ్మ దేవాలయం, హనుమాన్ దేవాలయం మీదుగా కన్నుల పండువగా కొనసాగింది. రథాన్ని లాగేందుకు యువకులు ఆసక్తిని చూపించగా, మహిళలు మంగళ హారతులతో రథం ముందు నడిచారు. కేరళ సంప్రదాయ వాయిద్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రథోత్సవ ఊరేగింపు జరుగుతున్న సమయంలో గోవిందా... గోవిందా అంటూ నామస్మరణతో మారుమోగింది. రథానికి ముందు ప్రత్యేకంగా డీజే ఏర్పాటు చేసి భక్తి పాటలతో అలరించాయి. రథ ఊరేగింపు కొనసాగుతున్న క్రమంలో ప్రత్యేకంగా తయారు చేయించిన బాణా సంచాలని పేలుస్తూ రథోత్సవాన్ని కొనసాగించారు. ఈ వేడుకల్లో ఆర్డీవో పాండు, కమిషనర్ తిరుపతి, డిప్యూటీ తహశీల్దార్ మధుకర్ రెడ్డి, రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లయ్య, మాజీ జడ్పీటీసీ సునీత, మాజీ వైస్ చైర్మన్ రాములు, మాజీ కౌన్సిలర్ లు ఎస్.సురేందర్ గౌడ్, రంగ సురేష్, ప్రదీప్ గౌడ్, హరి కృష్ణ గౌడ్, ప్రవీణ్ కుమార్, డి. శంకర్, తొట్ల మమత రామకృష్ణ, దుర్గేష్‌లతో పాటు ఆలయ కమిటీ సభ్యులు మల్లేశం, రంగ, మారుతి తదితరులు పాల్గొన్నారు.




## మండలంలో ముగిసిన భూ భారతి సదస్సులు.

- మండలంలో పూర్తి దరఖాస్తులు 1716.
- భూభారతి కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు...
- తాసిల్దార్ బి. అశోక్

**కొండాపూర్,మే 19(ప్రజాక్షేత్రం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం పైలేట్ మండలంగా ఎంచుకొని ఈనెల 4 న తోగర్ పల్లిలో గ్రామంలో ప్రారంభమై సోమవారం 19వ తేదీన మల్కాపూర్ గ్రామంలో భూ భారతి సదస్సులు ముగిశాయి. గ్రామాల వారిగా తొగర్పల్లి 125, అలియాబాద్ 35, గారకుర్తి 31, గిర్మాపూర్ 10, గోపులారం 51, హరిదాస్పూర్ 45, తేర్పోల్ 105, మాచేపల్లి 22, గడిమల్కాపూర్ 14, గొల్లపల్లి 55, మునిదేవునిపల్లె 143, గుంతపల్లి 38, సి.కోనాపూర్ 68, గంగారం 86, మన్సన్‌పల్లి 61, మహమ్మదాపూర్ 183, సైదాపూర్ 148, మరేపల్లి 54, కుతుబ్షాపేట్ 16, అనంతసాగర్ 100, కొండాపూర్ 162, మల్లేపల్లి 67, మల్కాపూర్ 97 దరఖాస్తులు వచ్చాయి. కొండాపూర్ మండలంలో మొత్తం 1716 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తాసిల్దార్ అశోక్ పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ కొండాపూర్ మండలం భూ భారతి పైలేట్ గ్రామంగా ఎంచుకోవడం చాలా సంతోషకరమని అన్నారు. గ్రామాలలో భూ భారతి కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. వచ్చిన దరఖాస్తులన్నీ పరిశీలించి 30 రోజుల్లో భూ సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. గ్రామాలలో రైతులు ఓపికగా దరఖాస్తులు చేసుకున్నందుకు రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వచ్చిన ప్రతి దరఖాస్తులు స్వీకరించిన రెవెన్యూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చుసిన పోలీస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్లు ప్రదీప్, మల్లేశం, ఆర్.ఐలు రాజు, రామచంద్రయ్య, రెవెన్యూ సిబ్బంది రమేష్, ఆంజనేయులు, షామా, రవికాంత్, సరిత రైతులు గ్రామస్తులు ఉన్నారు.



## తాగునీటి కోసం సింగాపూరం వాసుల ఆందోళన..

**శంకర్ పల్లి మే 19(ప్రజాక్షేత్రం):** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని సింగాపూరం వార్డులో ప్రజలకు, గ్రామస్తులకు తాగునీటి కోసం అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కొన్ని రోజుల నుంచి సరఫరా లేకపోవడంతో తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. దీన్ని నిరసిస్తూ సింగాపూరం ప్రజలు, మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. మండలంలో ఎక్కడ లేని సమస్య సింగాపూరంలో ఎలా ఏర్పడుతుందని, పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారా..? అంటూ గ్రామ వాసులు నిప్పులు చెరిగారు. ఏది ఏమైనా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా సంబంధిత అధికారులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మహిళాలు కోరారు.

**సక్రమంగా అందని భగీరథ నీళ్ళు..**

సింగాపూరం వార్డు కు భగీరథ నీళ్లు సక్రమంగా అందడం లేదు. నీళ్లు ఎప్పుడొస్తాయో..? కూడా తెలియదు.. నీళ్లు వచ్చిన రాకున్నా అధికారులకు అవసరం లేదు వారికి నెలాఖరులోగా జీతాలు వస్తే చాలు. ఇష్టారాజ్యంగా భగీరథ నీళ్లు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వం నిత్యం గ్రామ ప్రజలకు మిషన్ భగీరథ పథకం ద్వారా మంచినీళ్లు అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ గ్రామ ప్రజలకు ఆ తాగునీళ్లు అందించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. నిత్యం తాగునీళ్లు అందే విధంగా చూడాలి.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు

**మాక్లూర్,మే 19(ప్రజాక్షేత్రం):**



మాక్లూర్ మండల పరిధిలోని గంగారామంద గ్రామం లో సోమవారం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనలో భాగంగా మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఓబిసి జనరల్ సెక్రెటరీ గంగోనే రవీందర్ ముగ్గు వేశారు .ఈ సందర్భంగా లబ్ధిదారులకు విధివిధానాలు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గోపాల్ నాగేష్,ఒడేట్టి అంజయ్య, దండోరా సరికేల పోశెట్టి,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డ నిధి అమలుకు మంగళం

- పీ4తో ఆడబిడ్డ నిధిని ఎలా ముడిపెడతారు?
- అక్కచెల్లెమ్మలను మోసగించడం చంద్రబాబుకు అలవాటే
- శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ ఆగ్రహం
- విశాఖపట్నం క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ



**విశాఖపట్నం, మే 19( ప్రజాక్షేత్రం ):**

ఎన్నికల సందర్భంగా కూటమి పార్టీలు ఇచ్చిన 'ఆడబిడ్డ నిధి' హామీకి మంగళం పాడుతున్నాయని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నం క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఇటీవల ఓ సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ఆడబిడ్డ నిధిని పీ4లో పెట్టాను అనడం దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. అంటే ఎన్నికలకు ముందు మహిళలను ఆడబిడ్డ నిధి పథకం అంటూ నమ్మించి, తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వారిని పచ్చిగా మోసం చేయాలనే దుర్మార్గపు ఆలోచనతో చంద్రబాబు ఉన్నారని ధ్వజమెత్తారు. ఇంకా ఆయనేమన్నారంటే...

ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఆడబిడ్డ నిధి పేరుతో పద్దెనిమిది ఏళ్ళ నుంచి 59 ఏళ్ళ లోపు ఉన్న మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని హామీ ఇచ్చాయి. మూడు రోజుల కిందట చంద్రబాబు మాట్లాడుతూ ఈ పథకాన్ని పీ4లో పెట్టాను, దానిలో చూస్తాను అని చెప్పారు. పీ4కి, ఆడబిడ్డ నిధికి సంబంధం ఏమిటీ? ఏడాదికి రూ.18000 ఇస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావోస్తోంది. రాష్ట్రంలోని దాదాపు అర్హులైన కోటి మందికి పైగా మహిళలకు ఎప్పుడు ఆడబిడ్డ నిధిని ఇస్తారు? బీజేపీ, జనసేనలు కూడా చంద్రబాబు మాటలను సమర్థిస్తున్నారా? ఆడబిడ్డ నిధిని ఎప్పుడు ఇస్తారో ప్రకటించాలని ప్రతిపక్షంగా వైయస్ఆర్‌సీపీ తరుపున డిమాండ్ చేస్తున్నాం.

**మహిళలకు ఆశ చూపి వంచించడం చంద్రబాబు నైజం**

ఎన్నికలకు ముందు చంద్రబాబు, కూటమి పార్టీల నేతలు సూపర్ సిక్స్ హామీలు అంటూ ప్రజలను ఓట్లు అడిగారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ముందుగా మోసపోయేది మహిళలే. వారిని సునాయాసంగా నమ్మించి మోసగించడం చంద్రబాబుకు అలవాటు. అరచేతిలో వైకుంఠం చూపి, మాయమాటలతో ఓట్లు దండుకోవచ్చని చంద్రబాబు భావిస్తున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో డ్వాక్రా రుణమాఫీ అంటూ మహిళలను ఇలాగే మోసం చేశారు. ఇప్పుడు ఈ కూటమి ప్రభుత్వంలో కూడా ఇచ్చిన హామీల అమలుపై మాట్లాడటం లేదు. మహిళలకు ఉచిత బస్సును ఆగస్టు 15న ప్రకటిస్తామని లీకులు వదులుతున్నారు. తల్లికివందనంను గత ఏడాది పూర్తిగా ఎగ్గొట్టేశారు. ఈ ఏడాది స్కూల్స్ తెరిచిన తరువాత ఇస్తామంటూ చెబుతున్నారే తప్ప, అది కార్యరూపంలోకి వస్తుందా అనేది అనుమానం. హామీలను ఎగ్గొట్టే చర్యలను ప్రతిపక్షంగా చూస్తూ ఊరుకోం. అక్కచెల్లెమ్మలకు న్యాయం జరిగే వరకు వైయస్ఆర్సీపీ వారికి అండగా నిలబడి పోరాడుతుంది.

**విశాఖ జీవీఎంసీలో కూటమి పార్టీల్లో లుకలుకలు**

విశాఖపట్నం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నిక సాక్షిగా కూటమి పార్టీల మధ్య ఉన్న లుకలుకలు బయటపడ్డాయి. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నిక కోరం లేకపోవడం వల్ల వాయిదా పడింది. కూటమి పార్టీలకు చెందిన కార్పోరేటర్ల మధ్య తేడాలు ఉండటం వల్ల కోరంకు సరిపడే కార్పోరేటర్లు ఈ ఎన్నికకు హాజరుకాలేదని తెలుస్తోంది. కూటమి పార్టీలకు అధికారం, దానిని అడ్డం పెట్టుకుని దోచుకోవడమే ముఖ్యం. ప్రజలకు మంచి పాలన అందించాలనే ఆలోచనే లేదు. తమకు మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు వస్తే, దానిని అడ్డం పెట్టుకుని దోచుకోవాలనేదే వారి ఉద్దేశం. కూటమి పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే, కోరంకు సరిపడే సంఖ్యాబలం ఉండి కూడా డిప్యూటీ మేయర్ ఎన్నికను ఎందుకు చేయించుకోలేకపోయారు. సుమారు 63 మంది కార్పోరేటర్లు వారికి ఉండి కూడా దాదాపు ఇరవై మందికి పైగా కార్పోరేటర్లు ఈ ఎన్నికకు గైర్హాజరు అయ్యారు. ఈ పరిణామాలను బట్టి చూస్తే, కూటమి పార్టీలకు అధికారం మాత్రమే ముఖ్యమని తెట్టతెల్లమవుతోంది.

**రాష్ట్రంలో అస్తవ్యస్త పాలన**

రాష్ట్రంలో ఏడాది కాలంగా అస్తవ్యస్త పాలన సాగుతోంది. అన్నిచోట్లా సంఖ్యాబలం లేకపోయినా అధికార దుర్వినియోగంతో, పోలీసులను అడ్డం పెట్టుకుని, దౌర్జన్యాలతో పదవులను దక్కించుకుంటున్నారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను కూడా పోలీసులు పట్టించుకోవడం లేదు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యంపాలు చేస్తున్నారు. ఇది చాలా దురదృష్టకరం. ఏడాది కూటమి పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేశారు. ఆరు నెలలుగా జీవీఎంసీకి పూర్తిస్థాయి కమిషనర్ లేరు. ఇటువంటి కీలకమైన పోస్ట్‌లకు కూడా ఇన్‌చార్జిలను నియమించి పాలన సాగిస్తున్నారు. ఇటువంటి పాలనను ఎప్పుడూ చూడలేదు. జీవీఎంసీ మేయర్ ఎన్నికల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వెళ్ళిన 27 మంది కార్పోరేటర్లకు విప్ జారీ చేశాం. చట్టప్రకారం ఎన్నికల అధికారి పదిరోజుల్లో దానిపై స్పందించి ఆ 27 మందికి నోటీస్‌లు ఇచ్చి, వారి స్పందనను మాకు తెలియచేయాలి. కానీ ఎన్నికల అధికారి నుంచి ఎటువంటి స్పందన లేదు. అంటే చట్టాన్ని ఏ విధంగా కించపరుస్తున్నారు, ఏ విధంగా రాజకీయ ఒత్తిళ్ళతో చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే రెండుసార్లు ఎన్నికల అధికారికి రెండుసార్లు రిమైండ్ ఇచ్చాం. ప్రస్తుత వేసవి సెలవులు పూర్తయిన తరువాత దీనిపై న్యాయస్థానంను ఆశ్రయిస్తాం.

**స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వైయస్ఆర్‌సీపీ పూర్తి వ్యతిరేకం**

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడంలో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ది లేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అంగీకరించేది లేదు. ఆనాడు ప్రధాని మోడీ సమక్షంలోనే వైయస్ జగన్ గారు చాలా స్పష్టంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. కానీ ఇటీవల ప్రధాని రాష్ట్రానికి వచ్చిన సందర్భంలో కూటమి ప్రభుత్వం మాత్రం ఎందుకు ప్రధానిని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ప్రశ్నించలేదు? స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు దేనికైనా సిద్దం.



## ప్రైమరీ స్కూల్ ఐదో తరగతి గది శంకుస్థాపన కార్యక్రమం

**చౌటుప్పల్,మే 19(ప్రజాక్షేత్రం):**

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో 10 వ వార్డులో (బీసీ కాలనీలో) ప్రైమరీ స్కూల్ ఐదో తరగతి గది శంకుస్థాపన కార్యక్రమం చౌటుప్పల్ మున్సిపల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య మరియు మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ గారి చేతుల మీదుగా చేయడం జరిగినది ఇట్టి కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి ,మాజీ స్థానిక కౌన్సిలర్ బొడిగే అరుణ బాలకృష్ణ గౌడ్ ,ఎంఈఓ గురువారావు,ప్రైమరీ స్కూల్ ఇన్చార్జ్ హెడ్మాస్టర్ హర్షవర్ధన్,ఏఈ నితీష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోయ దేవేందర్ , మున్సిపల్ అధ్యక్షులు శ్రీ నరసింహ గౌడ్,రామాలయం చైర్మన్ బొబ్బిళ్ళ మురళి గౌడ్, సాధికార చైర్మన్ కరీం ,మాజీ కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస రెడ్డి,కొయ్యడు సైదులు గౌడ్,పబ్బు శ్రీకాంత్ గౌడ్,చింతల సాయిల్ ఎంపీ కయ్యం ఆవుల యేసు ఎండి ఎజాస్ చాంద్ పాషా,బత్తుల విప్లవ కుమార్, దేపా రాజు, మలిగం మల్లేష్,మహేష్, బండమీది వెంకటేష్, చింతకింది గణేష్ ,ముత్యాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.




## చౌటుప్పల్ కిరాణం అండ్ జనరల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకార మహోత్సవం

**చౌటుప్పల్,మే19(ప్రజాక్షేత్రం):** నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార మహోత్సవం తేదీ 19 మే 2025 రోజున కిరాణా అండ్ జనరల్ అసోసియేషన్ భవనములో జరిగినది నూతన అధ్యక్షులుగా కాంశెట్టి వెంకటేశం గుప్తా ఉపాధ్యక్షులుగా కైరం కొండ వెంకట నరసయ్య మరియు ఊర కృష్ణమూర్తి గుప్తా.. ప్రధాన కార్యదర్శిగా లింగాల లింగస్వామి గౌడ్, కోశాధికారిగా శ్రీ తడక మల్ల శ్రీనివాస్ గుప్తా, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా గుత్తా సురేందర్ రెడ్డి, బి వీరోజి,. సహాయ కార్యదర్శులుగా చల్లా మహేందర్ రెడ్డి, సముద్రాల శ్రీనివాస్ గుప్తా, సంయుక్త కార్యదర్శిగా గోరంటి నరసింహారాజు, కార్యవర్గ సభ్యులుగా ఉప్పల కృష్ణ గుప్తా ఎర్ర వెంకటేష్ గౌడ్, గట్టు సాయికిరణ్ గుప్తా, గుడుగుంట్ల వెంకటేష్, మంచి కంటి శంకర్ గుప్తా గౌరవ అధ్యక్షులుగా ఢిల్లీ శంకర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.గౌరవ సలహాదారులుగా వీసం చంద్రారెడ్డి, కాంసెట్టి చంద్రశేఖర్ గుప్తా, గోశిక సత్యనారాయణ, గట్టు ప్రభాకర్ గుప్తా ఎన్నిక కావడం జరిగినది ఈ ప్రమాణ స్వీకార మనకు ముఖ్యఅతిథిగా చౌటుప్పల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య హాజరై ఉపన్యసించారు. వాణిజ్యం ఒక యోగం లాగా నిర్వహించాలన్నారు. నాణ్యమైన సరుకులు అందజేస్తూ వినియోగదారుల ప్రశంసలకు పాత్రులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్విండో చైర్మన్ శ్రీ చింతల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ కిరాణా మరియు నిత్యవసర వస్తువులు ప్రజలకు సరసమైన ధరలకు అందిస్తూ సమాజానికి సేవ చేయడంలో కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో చౌటుప్పల మున్సిపాలిటీ పూర్వ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, పురపాలిక వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం గౌడ్, పెద్దింటి బుచ్చిరెడ్డి గుజ్జుల సురేందర్ రెడ్డి, పబ్బు రాజు గౌడ్ బోయ దేవేందర్, కడారి కల్పన, సుర్వి నరసింహ, ఉడుగు మల్లేష్ మంచి కంటి భాస్కర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు ప్రముఖ సాహితీవేత్త బడుగు శ్రీరాములు నూతన పాలకమండలిచే ప్రమాణ స్వీకారం చేయించారు.




## నూతన హెరిటేజ్ మిల్క్ డైరీ పార్లర్ ను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**నారాయణపురం,మే 19(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా,సంస్థాన్ నారాయణపురం మండలం కేంద్రంలో నూతన హెరిటేజ్ మిల్క్ డైరీ పార్లర్ ఓనర్ జనగాం గ్రామానికి చెందిన బొంగు నవీన్ గౌడ్ ఆహ్వానం మేరకు ప్రారంభోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై నూతన హెరిటేజ్ మిల్క్ డైరీ పార్లర్ ను ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎపూరి సతీష్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు షేక్ కైసర్,కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా నాయకులు మహ్మద్ కాలేక్,నోముల మాధవ రెడ్డి,యువజన కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ ,బొంగు రమేష్,ప్రభుత్వ ఉపాధ్యాయులు బోద్ర బోయిన నర్సింహ, మంచాల దశరథ తదితరులు పాల్గొన్నారు.

## కాచవాని సింగారం ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి : ఆర్. కృష్ణయ్య

**మేడ్చల్ మే 19(ప్రజాక్షేత్రం):** పేద ప్రజలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లు నిర్మించుకునేందుకు ఉపయోగపడే ప్రభుత్వ భూములను ప్రభుత్వం కార్పొరేట్ సెక్టార్ లకు, బడాబాబులకు దారాదత్తం చేస్తూ, భూ దందాలకు పాల్పడుతున్నదని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లా కాచివాని సింగారంలో పేద ప్రజలకు ఇండ్ల పట్టాలు ఇచ్చి ఏండ్లు గడుస్తున్నా వారికి ఇంటి స్థలాన్ని చూపించక పోవడంపై కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటి పట్టాల బాధితులతో కలిసి సోమవారం ఆయన మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కు ర్యాలీగా వచ్చి ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గ్రేటర్ హైదరాబాద్ సహా రాష్ట్రంలోని ఇండ్లు లేని పేదలందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజోపయోగాల కోసం పరిరక్షించాల్సిన ప్రభుత్వ భూములతో రియల్ ఎస్టేట్ దందాలు చేయడం మానుకోవాలన్నారు. లేదంటే ప్రజలు ప్రభుత్వంపై తిరగబడే రోజులు వస్తాయని హెచ్చరించారు. కాచివాని సింగారంలో 2002 2004 మధ్య కాలంలో బీసీ సంఘం పోరాటం ఫలితంగా 1,500 ల మందికి ప్రభుత్వం ఇండ్ల పట్టాలు ఇచ్చిందని, అయితే వాటిలో ఇప్పటి వరకు పొజిషన్ చూపలేదన్నారు. లబ్ధిదారులకు వెంటనే ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నీలం వెంకటేష్ మాట్లాడుతూ, ఇప్పటికైనా అక్కడ గుడిసె వాసులకు పొజిషన్ చూపాలన్నారు. బాకు రవి, నవీన్, యూత్ ప్రెసిడెంట్ గొల్లపల్లి అంజిలు మాట్లాడుతూ, కాచివాని సింగారంలోని సర్వే నంబర్: 66 లో గుడిసె వాసులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు అనంతయ్య, రాజేందర్, బాకి సోమయ్య, వెంకన్న, ఉపేందర్, నాగరాజు, చిన్న బాబు, విష్ణు, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.





## అసభ్యకరంగా ప్రవర్తించిన ట్రాన్స్ జెండర్ల బైండోవర్

**వనస్థలిపురం మే 19(ప్రజాక్షేత్రం):** బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకరంగా ప్రవర్తించిన ట్రాన్స్ జెండర్లను హయత్ నగర్ పోలీసులు బైండోవర్ చేశారు. ఆదివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో చెరుకు ఆశ, వాంకుడోత్ మౌనిక ఇద్దరు ట్రాన్స్ జెండర్లు హయత్ నగర్ లోని అనన్య రిసార్ట్ ఎదుట ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న హయత్ నగర్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. రూ. 50వేల వ్యక్తిగత హామీతో తహసీల్దార్ విడుదల చేశారు. ఇలాంటి తప్పు తిరిగి చేస్తే రూ. 50వేల జరిమానా, జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు.



## గ్రామ దేవతల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం

**వలిగొండ,మే 19(ప్రజాక్షేత్రం):**

భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలోని మునగాల తుర్కపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కనక దుర్గామాత దేవాలయంలో గ్రామ దేవతల ఉత్సవాల సందర్భంగా ఆదివారం రోజున ముఖ్య అతిథి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేనుగుడి కమిటీ సభ్యులు స్థానిక నాయకులు,శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ భీమా నాయక్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తుమ్మల యుగంధర్ రెడ్డి,పల్సం సతీష్ గౌడ్ మత్స్యగిరి గుట్ట చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ రెడ్డి,కుంభం విద్యాసాగర్ రెడ్డి,కుంభం వెంకట్ పాపిరెడ్డి, నూతిరమేష్,బోళ్ల శ్రీనివాస్, బాతరాజు బాలనర్సింహ, గంగాపురం సతీష్ గౌడ్,బద్దం సంజీవరెడ్డి,బత్తిని సహదేవ్ గౌడ్,పాశం సత్తిరెడ్డి,కనకల కిష్టయ్య, మామిడిసత్తిరెడ్డి, పాల కుర్ల వెంకటేశం,మార్కెట్ డైరెక్టర్ గుండు దానయ్య గౌడ్,ఎల్లయ్య,బాలరాజు కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## దుర్గం ఆలయానికి విరాళం అందించిన చిందం మల్లేష్.

**వలిగొండ,మే 19(ప్రజాక్షేత్రం):**

భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలోని మునగాల తుర్కపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామదేవతల దుర్గమ్మ పండుగ సందర్భంగా దుర్గమ్మ ఆలయానికి చిందం మల్లేష్ వ యాదమ్మ వంశరాజ్ దంపతులు 21000 వేల రూపాయలు విరాళం అందజేశారు అంతేకాకుండా గతంలో కూడా విరాళాలు అందజేశామని ఈ సందర్భంగా తెలియజేశారు.దుర్గమ్మ ఆలయానికి విరాళం ఇవ్వడం మాకు చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమం లో శ్యామల శంకర్ పావని సిహెచ్ రాజేష్ సిహెచ్ వరలక్ష్మి శ్యామల గంగయ్య వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## డాక్టర్ ఆర్ బి రాములు ను ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాయకులు ఎండి అక్బర్ భాయ్

**నారాయణపురం,మే 19 (ప్రజాక్షేత్రం):** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని షాదిఖాన ప్రాంగణంలో డాక్టర్ ఆర్ బి రాము ని ఘనంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అక్బర్ బాయి నాయకత్వంలో సన్మానించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ కష్టపడి చదువుకుంటేనే చదువుతోపాటు సంస్కారం విలువలు అభివృద్ధి చెందుతారని అన్నారు. చదువుకు కులాలు మతాలు అడ్డుకావు ప్రతి ఒక్కరు చదువుకొని ఉన్నత స్థాయి శిఖరాలకు ఎదగాలని కోరారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వాలు అనేక రంగాలలో కృషి చేస్తుంది ప్రభుత్వం గుర్తించి వారికి ప్రోత్సాహంతో ముందుకు తీసుకెళ్లి వారి జీవితాలలో వెలుగు నివ్వాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది అనంతరం నూతనంగా సేద తీర్చుకోవడం కోసం ఏర్పాటుచేసిన బెంచీల దాతగా నిలిచారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నోముల మాధవరెడ్డి,కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు ఏపూరి సతీష్ రాస మల్ల యాదయ్య,అంతటి స్వామి రాచకొండ రమేస్ పెద్దగోని విష్ణు వలిగొండ మాధవులు సీనియర్ జర్నలిస్టు సింగం కృష్ణ పెద్దగోని బిక్షం మల్లయ్య తాయారు తదితరులు పాల్గొన్నారు.

# మణికొండ డాలర్ హిల్స్‌లో హైడ్రా కూల్చివేతలు

**గండిపేట్ మే 19(ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లాలో మరోసారి హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. మణికొండ మున్సిపల్ డాలర్ హిల్స్ లో ఉద్రిక్తతల నడుమ హైడ్రా కూల్చివేతలు జరుగుతున్నాయి. సోమవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డాలర్ హిల్స్ కాలనీలో పార్కు స్థలం కబ్జా చేసి చేపట్టి నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తోంది. పార్క్ స్థలం కబ్జాకు గురైందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు డాలర్ హిల్స్ కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. 15 రోజుల క్రితం హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మే 14న డాలర్ హిల్స్ కాలనీలో స్థలాన్ని హైడ్రా కమిషనర్ పరిశీలించారు. తెల్లవారుజాము నుంచి భారీ బందోబస్తుతో కూల్చివేతలు చేపట్టారు.

**దూకుడు పెంచిన హైడ్రా...**

హైడ్రాకు సంబంధించిన వందలాది మంది సిబ్బందితో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. జేసీబీల సహాయంతో పెద్ద ఎత్తున కూల్చివేతలు చేపట్టారు. ఇటీవల కాలంలో హైడ్రా పోలీస్‌స్టేషన్ ఓపెన్ చేసిన తర్వాత మరింత దూకుడు పెంచింది. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు ఉన్నాయనే దీనిపై తమ దృష్టికి వస్తే ఫిర్యాదులను స్వీకరించి విచారణ జరిపిన తర్వాత చర్యలు తీసుకుంటున్నారు. పార్క్ కబ్జాకు గురైందని మూడు సంవత్సరాల నుంచి మున్సిపాలిటీ, హెచ్ఎండీఏ కార్యాలయం చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవలేదని స్థానికులు అన్నారు. అయితే హైడ్రాకు ఫిర్యాదు ఇచ్చిన 15 రోజులకే హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్థలాన్ని పరిశీలించి చర్యలు చేపట్టడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## రామగుండం మాజీ ఎమ్మెల్యే కుటుంబాన్ని పరామర్శించిన మాజీమంత్రి కొప్పుల.



**జూలపల్లి,మే 19,(ప్రజాక్షేత్రం):**

జూలపల్లి మండలంలోని బాల్రాజ్ పల్లి గ్రామానికి చెందిన రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మేనమామ బండారి మల్లయ్య ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న మాజీ మంత్రివర్యులు కొప్పుల ఈశ్వర్,పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ వారి నివాసానికి వెళ్లి,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రామగుండం మున్సిపల్ వైస్ చైర్మన్ అభిషేక్ రావు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు ర్యాకం భాస్కర్, తోటరాములు,పెర్క రవి, కోరుకంటి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 2న రాజీవ్ యువ వికాసం కింద రూ.1000 కోట్లు మంజూరు..!


**తెలంగాణ గడ్డపై దశాబ్దాలుగా "దున్నేవాడిదే భూమి నినాదం"**

**ఇందిరా సౌర గిరి జిల్లా వికాసం పథకాల ద్వారా చట్టాలుగా అమలు**

**తెలంగాణ గడ్డపై ఉన్న నినాదాలు చట్టాలుగా మారాలంటే..**

**మరో 20 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండాలి**

**అచ్చంపేట బహిరంగ సభలో ప్రసంగించిన భట్టి విక్రమార్క**



**హైదరాబాద్ మే 19(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ గడ్డపై దశాబ్దాలుగా ఉన్న దున్నేవాడిదే భూమి నినాదాన్ని ఇందిరా సౌర గిరి జిల్లా వికాసం వంటి పథకాల ద్వారా చట్టాలుగా అమలు చేస్తున్నామని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం ప్రారంభ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం ప్రసంగించారు. తెలంగాణ గడ్డపై ఉన్న నినాదాలు చట్టాలుగా మారాలంటే మరో 20 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండాలన్నారు. నల్లమల డిక్లరేషన్‌ను తూచా తప్పక పాటించి నాలుగు సంవత్సరాల్లో ఈ రాష్ట్ర గిరిజనులకు ఫలితాలు అందిస్తామని మరోసారి హామీ ఇచ్చారు. ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం ప్రారంభం భారతదేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజు.. దేశంలోనే గర్వించదగిన గొప్ప కార్యక్రమమని కొనియాడారు. గత ప్రభుత్వంలో గిరిజనులు పంట పండించుకోవడానికి వెళితే మహిళలని చూడకుండా చెట్టుకు కట్టేసి కొట్టారని.. పురుషుల పై పోలీసు కేసులు నమోదు చేశారని ఆరోపించారు.

రాష్ట్రం అభివృద్ధి చెంద వద్దని, ఫలితాలు ప్రజలకు అందవద్దని నిత్యం ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వంపై ఒక మాట అన్న, కుట్ర చేసిన అది రాష్ట్ర ప్రజలపై కుట్రగానే భావిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. జూన్ 2న గిరిజన యువతకు రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకం ద్వారా




1000 కోట్లు మంజూరు చేయబోతున్నామని తీపి కబురు చెప్పారు. ఇది పేదల ప్రభుత్వం మన ప్రభుత్వం గుండెల్లో పెట్టుకొని కాపాడుకోండని పిలుపునిచ్చారు.. ఇందిరా జల వికాసం ఆరంభం మాత్రమే కాబోయే రోజుల్లో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయబోతున్నామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో యావత్ క్యాబినెట్ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందని నల్లమల్ల సాక్షిగా మాట ఇచ్చారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా ఓ ఉమ్మడి కుటుంబాన్ని, అద్భుతమైన సమాజాన్ని నిర్మించబోతున్నామని తెలిపారు.

## ఆ పోలిసుకు ముడుపులు ముట్టుతే చాలు

**నిజామాబాద్:మే19(ప్రజాక్షేత్రం)** ఆర్మూర్ డివిజన్ పరిధిలో ఓ పోలీస్ స్టేషన్ లో మొరం ,ఇసుక,పర్మిట్లు అయిన ,సక్రమం అయిన0 ఆక్రమం అయిన ఆ మండల పోలీస్ అధికారికి ముడుపులు ఇవ్వాల్సిందే .నీతి నిజాయితీ అంటూ చిరంజీవిల నటిస్తూ మళ్ళీ డబ్బులు అడుగలిసిందే. నెలకు 5లక్షల వరకు ముడుపులు రాకుంటే అక్రమ కేసులు చేయాలి బెదిరింపులు చేయడం,ఆర్డర్ మెస్ లో మద్యం తాగిన సరే ముడుపులు ఇవ్వండి తాగండి అంటూ బహిరంగంగా చెప్తున్నట్లు వినికిడి.సామాన్య ప్రజలు వస్తే లోకల్ నాయకులను తీసుకొని రావాలి అని,కేసు ఏది అయినా బాధితులు ఎవరు అయినా రెండు వైపుల నుంచి ముడుపులు ఇవ్వాల్సిందే.నేరుగా వసూళ్లకు పాల్పడితే తను ఎక్కడ బద్నాం అవుతునో అని నమ్మకమైన కానిస్టేబుల్ తో తమ పరిధిలో దందలకు పాల్పడే వ్యక్తుల నుంచి మామూళ్లు తెప్పించుకుంటున్నట్లు సమాచారం,డబ్బులు నేరుగా అడగకుండా పోలీస్ స్టేషన్ రేనోవేషన్ సాకుగా చూపి డబ్బులు వసూలు చేస్తున్నట్లు, సివిల్ తగాదాలను స్టేషన్లోనే సెటిల్మెంట్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



## సూది గుచ్చకుండానే రక్త పరీక్ష రిపోర్టు..

**హైదరాబాద్ మే 19(ప్రజాక్షేత్రం):**

భారతదేశంలో మొట్టమొదటి సరిగా సూది అవసరం లేకుండానే రక్తపరీక్ష చేసి ఒక్క నిమిషంలోనే రిపోర్ట్ ఇచ్చే ఏఐ బేస్డ్ డయాగ్నస్టిక్ టూల్‌ను నిలోఫర్ లో అందుబాటులోకి తెచ్చారు.. నిలోఫర్ హాస్పిటల్, సుశేనా హెల్త్ ఫౌండేషన్‌తో కలిసి క్విక్ వైటల్స్ దిన్ని అందుబాటులోకి తెచ్చింది.. ఫోటో ప్లెథిస్మోగ్రఫీ ద్వారా మొబైల్ లో ఫేస్ స్కానింగ్ ద్వారా 20 నుంచి 30 సెకన్లలోనే టెస్టులు పూర్తవుతాయి. ఈ పరీక్ష విధానాన్ని మొదట నిలోఫర్ లోకి అందుబాటులోకి తెచ్చి తరువాత మహారాష్ట్రలో ప్రవేశపెట్టనున్నారు.. నిలోఫర్ లో పిల్లలకు, గర్భిణులకు ఇలాంటి టెస్టులు ఎంతో ఉపయోగకరంగా ఉండనున్నాయి.




## జీబీఆర్ క్రిప్టో కేసు.. మరో ఇద్దరు నిందితుల అరెస్టు

**హైదరాబాద్ మే 19(ప్రజాక్షేత్రం):**

జీబీఆర్ క్రిప్టో కేసులో ఇద్దరు నిందితులను తెలంగాణ సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఏ11గా ఉన్న కె. సుధాకర్, ఏ12గా ఉన్న రమేశ్‌రెడ్డిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ కేసులో ఇప్పటికే ఏ2, ఏ6, ఏ7, ఏ8ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. దేశ వ్యాప్తంగా 1,400 మంది బాధితుల నుంచి సుమారు రూ.95 కోట్ల మొత్తాన్ని నిందితులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నగదును వివిధ కంపెనీలకు మళ్లించినట్లు సీఐడీ అధికారులు గుర్తించారు.



# యశ్‌కు జంటగా టాలీవుడ్ చందమామ



టాలీవుడ్, బాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసిన ప్రముఖ నటి కాజల్ అగర్వాల్. పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే చాలా రోజుల తర్వాత సత్యభామ అంటూ ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి హిట్ అందుకుంది. అయితే ఈ భామ తాజాగా మరో బంఫరాఫర్ కొట్టినట్లు తెలుస్తుంది. బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం రామాయణలో కాజల్ ఛాన్స్ కొట్టేసినట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో కాజల్ రావణుడి భార్య మండోదరి పాత్రలో కనిపించనున్నారు. నితీష్ తివారి 'రామాయణ' ప్రాజెక్ట్ అనౌన్స్ చేసినప్పటి నుంచి నటీనటుల ఎంపికపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి ఖరారయ్యారు. ఇప్పుడు మండోదరి పాత్ర కోసం కాజల్ అగర్వాల్‌ను ఎంపిక చేసినట్లు టాక్. కాజల్ అగర్వాల్ తన కెరీర్‌లో వైవిధ్యమైన పాత్రలు పోషించారు. ఆమె నటనకు మంచి గుర్తింపు ఉంది. 'మగధీర', 'డార్లింగ్', 'బృందావనం' వంటి తెలుగు చిత్రాలతో పాటు, 'సింగం', 'స్పెషల్ 26' వంటి హిందీ చిత్రాల్లోనూ ఆమె తన ప్రతిభను చాటుకున్నారు. ఇప్పుడు 'రామాయణం' వంటి ప్రతిష్టాత్మక చిత్రంలో మండోదరి వంటి బలమైన పాత్రలో ఆమె ఎలా మెప్పిస్తారో చూడాలి.

మండోదరి పాత్ర రామాయణంలో ఒక ముఖ్యమైన పాత్ర. ఆమె రావణుడికి మంచి సలహాలు ఇస్తూ, ధర్మం వైపు నిలబడే ప్రయత్నం చేస్తుంది. తన భర్త తప్పులను ఎత్తిచూపుతూ, సీతను తిరిగి రాముడికి అప్పగించాలని సూచిస్తుంది. కాబట్టి, ఈ పాత్రకు కాజల్ వంటి అనుభవం ఉన్న నటి అయితే మరింత న్యాయం చేకూరుస్తుందని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.



## ఇది యముడికి నాకు జరిగే కథ

లోక నాయకుడు కమల్ హాసన్ రచనా సహకారంతో సెన్సేషనల్ డైరెక్టర్ మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా "థగ్ లైఫ్". రాజ్‌కమల్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ బ్యానర్లపై కమల్ హాసన్, మణిరత్నం, ఉదయనిధి స్టాలిన్, ఆర్ మహేంద్రన్ తదితరులు నిర్మించిన ఈ సినిమా జూన్ 5వ తేదీన రిలీజ్‌కు ముస్తాబవుతున్నది. 1987 సంవత్సరంలో నాయకన్ సినిమా తర్వాత 38 ఏళ్ల అనంతరం కమల్ హాసన్, మణిరత్నం కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా తమిళ, తెలుగు ట్రైలర్ ఆవిష్కరణ చెన్నైలో జరిగింది. ''ఇది యముడికి నాకు జరిగే కథ. నువ్వా.. నేనా?'' అంటూ ట్రైలర్ ఆఖర్లో కమల్ చెప్పిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో కమల్ హాసన్‌తోపాటు శింబు, త్రిషా కృష్ణన్, అభిరామి, ఐశ్వర్య లక్ష్మీ, సాన్యా మల్హోత్రా, జోజు జార్జ్, అశోక్ సెల్వన్, నాజర్, పంకజ్ త్రిపాఠి, మహేష్ మంజ్రేకర్, తనికెళ్ల భరణి తదితరులు నటించారు. ఈ మూవీకి సినిమాటోగ్రాఫర్‌గా రవి కే చంద్రన్, ఎడిటర్‌గా ఏ శేఖర్ ప్రసాద్, మ్యూజిక్ డైరెక్టర్‌గా ఏఆర్ రెహ్మాన్ వ్యవహరించారు. కమల్ ఈ సినిమాలో శక్తిమంతమైన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించారు. ఆయన్ని అమితంగా ఇష్టపడే శిష్యుడిపాత్రలో శింబు కనిపించారు. అయితే గురుశిష్యులుగా మొదలైన ఈ బంధం.. ఓ బలమైన ప్రతీకార సంబంధంగా మారడాన్ని ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. మరి వాళ్లిద్దరూ శత్రువులుగా మారడానికి కారణమేంటి? వాళ్లిద్దరి మధ్య జరిగిన పోరు ఎలా సాగింది? అందులో ఎవరు పైచేయి సాధించారు? తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

## త్వరలోనే లవ్ మ్యారేజ్ చేసుకోబోతున్నా

తమిళ నటుడు విశాల్ తెలుగు ప్రేక్షకులకి బాగా తెలిసిన వ్యక్తి. పందెం కోడి చిత్రంతో ఆయన టాలీవుడ్ ప్రేక్షకులకి దగ్గరయ్యారు. ఇటీవల 'మద గజ రాజా' అనే కామెడీ చిత్రంలో నటించారు. ఈ సినిమా మంచి విజయం సాధించింది. అయితే గత కొద్ది రోజులుగా విశాల్ పెళ్లి గురుంచి సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు చూస్తూనే ఉన్నాం . ఈ క్రమంలో ఆయన పెళ్లిపై స్పందించారు. " కొంతకాలంగా ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నా. ఆమెతో త్వరలో పెళ్లి జరుగుతుంది. రెండు నెలల్లో నటుల సంఘం భవన నిర్మాణం పూర్తయి, ప్రారంభోత్సవం జరుగుతుందని అంచనా వేస్తున్నా. అదయితే ఇక సెప్టెంబర్‌లో పెళ్లి జరుగుతుంది. అని విశాల్ చెప్పారు". దీనిపై అధికారిక ప్రకటన విశాల్ పుట్టినరోజున వెలువడుతుంది అంటున్నారు. మరి విశాల్ ప్రేమించిన అమ్మాయి ఎవరనే ఆసక్తి అందరిలో ఉంది.



## సినీ ప్రియులకు బిగ్ షాక్



తెలుగు రాష్ట్రాల్లో సింగిల్ స్క్రీన్ థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. సినిమాలు హిట్ అయితే పర్లేదు. కానీ ఫట్ అయితే సింగిల్ స్క్రీన్ థియేటర్ల పరిస్థితి ఈగలు తోలుకున్నట్టే ఉంది. కలెక్షన్లు లేక, ప్రేక్షకులు రాక కొన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లు షోస్ క్యాన్సిల్ చేస్తున్న పరిస్థితి ఉంది. ఈ క్రమంలో సింగిల్ స్క్రీన్ థియేటర్లకు ఊపిరి పోయాలని, లేకపోతే శాశ్వతంగా మూతపడే సింగిల్ స్క్రీన్ థియేటర్ల సంఖ్య అంతకంతకూ పెరుగుతుందని భావించిన ఎగ్జిబిటర్లు హైదరాబాద్ లో మీటింగ్ పెట్టారు. ఆదివారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్స్ లో నిర్మాతలు దిల్ రాజు, సురేష్ బాబుతో ఏపీ, తెలంగాణwకు చెందిన 65 మంది ఎగ్జిబిటర్లు భేటీ అయ్యారు. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల థియేటర్ల ఓనర్లు సంచలన నిర్ణయం తీసుకున్నారు. థియేటర్లను అద్దెలతో నడిపించే పరిస్థితి లేదని,తమకు సినిమాలో పర్సెంటేజీ ఇవ్వాల్సిందే అంటూ తేల్చి చెప్పారు. తమ డిమాండ్లు నెరవేర్చేదాకా జూన్ 1 నుంచి థియేటర్లను బంద్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఇన్ని రోజులు థియేటర్లను అద్దెలపై నడుపుతున్నామని,తమకు అది ఏ మాత్రం సరిపోవట్లేదని తేల్చి చెప్పారు. పైగా బెన్ ఫిట్ షోలు, ప్రీమియర్ షోలతో తమకు నష్టాలే వస్తున్నాయన్నారు. ఈ నిర్ణయంతో జూన్ లో విడుదల కాబోయే సినిమాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. జూన్ వచ్చేలోపు ఎగ్జిబిటర్ల సమస్యలను డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలు నెరవేర్చే పరిస్థితులు పెద్దగా కనిపించట్లేదు. దీన్ని బట్టి చూస్తుంటే జూన్ లో వచ్చే సినిమాల వాయిదా మరోసారి తప్పదా అని నెటిజన్లు అంటున్నారు.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at M R Publications, #6-31880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500070. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy, Hyderabad, Telangana 501203. Editor : K PRAVEEN KUMAR.
Phone number 9177920459, email id : prajakshetram1@gmail.com, https://prajakshetram.in, RNI NO. TELTEL/12330